# బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం, 12 మే-2026
balagamtv100@gmail.com
పేజీలు-8


## మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి



- సభ్యులులుగా శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ
- మరో సహభ్యురాలుగా చాకలి ఐలమ్మ మనవరాలు

మిగతా 7లో..

## మోర్తాడ్‌లో రైతుల రహదారి ధర్నా




వివరాలు 2లో..

## గవర్నర్‌ను కలిసిన సిఎం రేవంత్



హైదరాబాద్,మే 11 : రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ను లోక్ భవన్‌లో ముఖ్య మంత్రి ఏ. రేవంత్ రెడ్డి కలిసారు. జూన్ 12 న పాఠ శాల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థు లతో నిర్వహించే సభకు గవర్నర్ ను ఆహ్వానిం చారు. విద్యార్థులు పొగాకు, మద్యం ,మాదక ద్రవ్యా లకు దూరంగా ఉండాలని, బాధ్యతగల పౌరు లుగా ప్రవర్తించాలని సభలో సామూహిక ప్రతిజ్ఞ చేయించనున్న ప్రభుత్వం. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి గతంలో సూచించిన గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా. గవర్నర్ సూచన ను గౌరవిస్తు విద్యార్థులతో భారీ సభ ఏర్పాటు చేసి యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించనున్నట్లు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి గవర్రన్‌ను సిఎం ఆహ్వానించేందుకు కలిసారు.

## కులానికో రెసిడెన్షియల్ పాఠశాల



- వీటితో సమాజాంలో పెరుగుతున్న కులవివక్ష
- కులవివక్ష రూపు మాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- విద్యారంగ అభివృద్ధి కోసమే విద్యాశాఖను పర్యవేక్షిస్తున్నా
- 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో విద్యా వారోత్సవాలు
- ఎల్బీ స్టేడియంలో ప్రారంభించిన సిఎం రేవంత్

4లో..

## సనత్‌నగర్ టిమ్స్‌లో పూర్తిస్థాయి వైద్యసేవలు



- అధికారులతో సమీక్షలో మంత్రి దామోదర ఆదేశం

వివరాలు 6లో..

## బెంగాల్ నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం

- సరిహద్దుల్లో కంచె ఏర్పాటుకు అంగీకారం
- ఉద్యోగుల పదవీవిరమణ వయసు పెంపు
- మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం

వివరాలు 4లో..

## తమిళనాడు సిఎం విజయ్ ఆదర్శం



- స్టాలిన్ , వైకోల ఇంటికి వెళ్లి వారితో భేటీ
- మర్యాదపూర్వకంగా కలుసుకున్న సిఎం
- ఎమ్మెల్యేగా సోమవారం అసెంబ్లీలో ప్రమాణం

వివరాలు 6లో..

## మే నెలాఖరుకు 3లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్



- రామగుండం కర్మాగారం నుండి 90 శాతం సరఫరా
- రైతులకు నానో యూరియాపై కంపెనీలకు అవగాహన
- ఎమ్మార్పి కంటే ఎక్కువ ధరకు అమ్మకాలు జరిపితే చర్యలు
- సేంద్రియ వ్యవసాయానికి కేంద్రం ప్రోత్సహకాలు అందించాలి
- రాష్ట్ర ఫెర్టిలైజర్‌యాప్ మార్గదర్శకంగా కేంద్రం సరికొత్త యాప్
- ఎరువుల కంపెనీల ప్రతినిధులతో మంత్రి తుమ్మల

వివరాలు 6లో..

## మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

- హ్యామ్ రోడ్లపై నేడోరేపో సిఎంతో చర్చలు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్,మే 11 : నాణ్యమైన మౌలిక వసతుల అభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పుకొచ్చారు. మొత్తం 6,092 కిలోమీటర్ల పొడవుతో 34 ప్యాకేజీలుగా హ్యామ్ పనులు కొనసాగుతున్నాయని అన్నారు. హ్యామ్ తుది అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డితో మంగళవారం లేదా బుధవారం కలిసి చర్చిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. హ్యామ్ ప్రాజెక్ట్ పురోగతిపై సోమవారం సచివాలయంలో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు.

వివరాలు 3లో..

## సికింద్రాబాద్ యువకుడి హత్యకేసు

- 10మంది నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు
- యువతితో ప్రేమాయణమే కారణమన్న డిసిపి

వివరాలు 3లో..

## గుప్తనిధుల కోసమే ఆలయం కూల్చివేత



- రేవంత్ డైరెక్షన్‌లోనే కూల్చివేతలు
- కూల్చిన ఆలయం వద్ద పరిశీలించిన హరీష్ రావు

వరంగల్,మే11 : లంకెబిందెల కోసమే పురాతమైన ఆలయాలను కూల్చివేస్తున్నారని, సీఎం రేవంత్ రెడ్డికి కూల్చడం తప్ప కట్టడం రాదని శాసనసభ విపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. వరంగల్ జిల్లా ఖానపురం మండలం అశోక్ నగర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేసిన 800 ఏండ్ల చారిత్రక కాకతీయ కట్టడం శివాలయాన్ని పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. గుప్త నిధుల కోసం రేవంత్ రెడ్డి డైరెక్ష న్‌లో తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపిం చారు. స్కూల్ నిర్మాణం కోసం

వివరాలు 3లో..

## అభివృద్ధికి కేంద్ర సహకారం తప్పనిసరి

- రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి తీసుకు వెళతాం : మోడీ
- రాష్ట్ర ప్రాజెక్టుకు అనుమతులను మాత్రమే కోరాం
- రాష్ట్రప్రయోజనాల కోసమే నా పోరాటం
- బిజెపిని ఓడించి సిఎం అయిన వ్యక్తిని నేను
- బిజెపి అంటే.. బ్రిటీష్ జనతా పార్టీ
- విభజించు పాలించడం బీజేపీ రాజకీయం
- మోడీ పాలానానుభవ రాహిత్యంతో దేశానికి నష్టం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్,మే11 : రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం తప్పనిసరి అని తెలం గాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కేంద్ర సహకారం అవసరమని తెలిపారు. అభివృద్ధి విషయంలో కలిసి పనిచేద్దామని ప్రధాని చెప్పారని.. తమ మ ధ్య జరిగిన చర్చ పూర్తిగా అభివృద్ధికి సంబంధించినదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.తెలంగాణ హక్కుల కోసం తాము కేంద్రంతో పోరాడుతామని కూడా వ్యాఖ్యానించారు. సోమవారం సీఎం రేవం త్‌రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ చిట్‌చాట్‌లో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ విధానాలు, రాష్ట్ర అభివృద్ధి, మావోయిస్టుల సరెండర్‌లు, మహిళా రిజర్వేషన్లు, రీజినల్ రింగ్ రోడ్, బండి భగీరథ్ కేసు వంటి అనేక కీలక అంశాలపై స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం హెచ్ఐసీసీలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. హెచ్ఐసీసీలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రధాని మోదీతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాను ప్రస్తావించిన అభివృద్ధి అంశాలను ప్రధాని

వివరాలు 3లో..

## కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం

- కనీస వేతన సవరణపై సబ్‌కమిటీ భేటీలో భట్టి



హైదరాబాద్,మే 11 : కార్మికుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. కార్మికుల జీవన ప్రమాణాలు పెంచడమే తమ ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యమని పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులు,

వివరాలు 4లో..

## బండి కుమారుడి కేసుపై సిఎం సీరియస్



- విచారణకు డిజిపిని ఆదేశించిన రేవంత్
- సిట్ ఏర్పాటు చేస్తూ డిజిపి ఉత్తర్వులు

వివరాలు 2లో..

# ఆర్మూర్ సొసైటీకి తాళం



- ధాన్యం తరలించక పోవడంపై రైతుల నిరసన

**నిజామాబాద్,మే11:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ సొసైటీ పరిధిలోని రాంపూర్ గ్రా మంలో నెలరోజులుగా ధాన్యం కోసి కల్లాల్లో వేసి తూకం చేసిన కూడా లారీల కొరతతో ఎక్కడిధాన్యం అక్కడే ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాంపూర్ గ్రామస్తులు ఆర్మూర్ సొసై టీకి సోమవారం తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. సొసైటీ నిర్వాహకులు లారీ యజమానులతో కుమ్మక్కై లారీలను తమ గ్రామానికి పంపడం లేదని, మిగతా గ్రామాలకు ప్రతీరోజు ఒక టి, రెండులారీలను పంపుతూ ధాన్యం సేకరిస్తున్నా రని, తమ గ్రామం పై వివక్ష ఎందుకు చూపిస్తు న్నారని సొసైటీ చైర్మ న్ని నిలదీశారు. ధాన్యం రోజుల తరబడి కల్లాల్లో ఉం డడం వల్ల తరుగు రూపంలో క్వింటానికి 10 కిలోల వరకు తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లారీలను పంపి కొరతను తీరుస్తానని నిర్వా హకులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించి రెండు రోజులలో లారీలను తీసుకొని రాకుంటే ఆర్మూ ర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద గ్రామస్తులము అందరం కలిసి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

# బండి కుమారుడిని ఎందుకు అరెస్ట్ చేయరు

**రేవంత్ కుమ్మక్కయ్యారన్న అనుమానం**

**శాసన మండలి సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్ రావు**

**హైదరాబాద్,మే11 :** బాలికపై లైంగికదాడి కేసులో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌ను పోలీసులు ఇంకా ఎందుకు అరెస్టు చేయడం లేదని శాసన మండలి సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రతి రోజూ దేశం కోసం, ధర్మం కోసం పోరాడుతున్నానని చెప్పే కేంద్రమంత్రి, తన కుమారుడు అఘాయిత్యం చేస్తే ఏమీ జరగలేదని వెనకేసుకు రావడం దారు ణమన్నారు. పైగా ఇంత జరిగాక కూడా ఆయన ఏమీ ఎరుగనట్లు ప్రధాని సభలో పాల్గొనడం సిగ్గుచేటన్నారు. 'బేటీ బచావో' అంటూ నినాదాలిస్తూ నీతి వాక్యాలు పలికే బీజేపీ నేతలు, తమ కేంద్రమంత్రి ఒక మైనర్ ఆడపిల్ల పట్ల చేస్తున్న కుట్రలను ఖండించాలన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్, రాష్ట్ర హోం శాఖను నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఇద్దరూ కుమ్మక్కై ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్సీ రవీందర్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో ఒక బాలికకు అన్యాయం జరిగితే న్యాయం చేయలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇక ప్రజలకు ఏం న్యాయం చేస్తాయని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయించాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని, ఈ ఘటనపై న్యాయం కోసం ఉద్యమించి, దేశవ్యాప్తంగా అన్నిపక్షాల మద్దతు కూడగడుతుందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు హెచ్చరించారు.

# బండి భగీరథను ఎందుకు అరెస్ట్ చేయరు

**నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి విమర్శ**

**బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన**



**నాగర్ కర్నూల్,మే11 :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుంచి బండి సంజయ్‌ను తక్షణమే బర్తరఫ్ చేయాలని బిఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి డిమాండ్ చేశారు. డీజీపీ స్థాయి మహిళా అధికారి సమక్షంలో మెజిస్ట్రేట్ ఎదుట బాధిత అమ్మాయి, ఆమె తల్లి స్టేట్‌మెంట్ ను రికార్డు చేయాలని, బండి భగీరథ్ ను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. బండి భగీరథపై కఠినమైన చర్యలు తీసుకోవడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సిగ్గుచేటని ఆరోపించారు. బాధిత కుటు ంబ సభ్యులను వేధించడం దుర్మార్గమని పేర్కొన్నారు. బాధితురాలికి సరైన న్యాయం చేయడమే కాకుండా.. వారి కుటుంబానికి రక్షణ కల్పించాలన్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, బండి సంజయ్‌ను కాపాడాలని చూస్తున్నారని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సం చలం సృష్టిస్తున్న కేసుపై కాంగ్రెస్ నాయకులు, మహిళా మంత్రులు ఎందుకు మాట్లాడడంలేదని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమా రుడు భగీరథ్ పై కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్ట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. వెంటనే అతడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్, రాష్ట్ర హోమ్ శాఖను దగ్గర పెట్టుకున్న రేవంత్ రెడ్డి కుమ్మక్కై కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మైనర్ బాలికకు న్యా యం చేయకుండా, బండి సంజయ్ కుమారుడిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని, రాష్ట్రంలో పేదలకు ఒకన్యాయం, పెద్దలకు ఒకన్యాయమా అని ప్రశ్నించారు. జరిగిన ఘటనపై కేంద్ర మంత్రి బండి సంజయ్ పదవికి రాజీనామా చేయాలని, రేవంత్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, లేనిపక్షంలో బాధితుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

# మీ కొడుకు లైంగిక దాడి చేస్తే క్షమించవద్దు

**సంచలనంగా సునీతా కృష్ణన్ పోస్ట్**

**హైదరాబాద్,మే11 :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు బండి సాయి భగీరథ్ ఓ బాలికపై లైంగికదాడి యత్నానికి పాల్పడిన వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెతిస్తున్నసంగతి తెలి సిందే. ఈ ఘటనలో బండి సాయి భగీరథ్‌పై హైదరా బాద్ నగరంలోని పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. మరోవైపు ఈ కేసు విచా రణకు రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను కూడా ఏర్పాటుచేసింది. ఈ క్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహిత, సంఘసేవ కు రాలు సునీతా కృష్ణన్ తల్లిదండ్రులకు సూచనలు చేస్తూ ట్వీట్ చేశారు. 'తల్లిదండ్రులందరినీ అభ్యర్థిస్తున్నా.. ఒక వేళ మీ కొడుకు లైంగిక దాడులు చేస్తే అతన్ని కాపాడే ప్రయత్నం చేయకండి. ఇలాంటి తప్పులు చేస్తే శిక్ష అనుభవించక తప్పదని వారికి తెలిసేలా చేయడం వల్ల సమాజానికి మీరు గొప్ప సేవ చేసినవారవు తారని' సునీతాకృష్ణన్ ట్వీట్ చేశారు. సునీతాకృష్ణన్ బండి సంజయ్ కుమారుడి కేసును గుర్తు చేస్తూ పరోక్షంగా చేసిన ఈ ట్వీట్ అందరినీ ఆలోచింప జేస్తుంది.

# బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలి

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డిమాండ్**



**హైదరాబాద్,మే11 :** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌ను అరెస్టు చేయకుండా పోలీసులు తాత్సారం చేస్తున్నారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మండిపడ్డారు. మైనర్ బాలిక అని తెలిసి కూడా బండి సంజయ్ కుమారుడు అత్యాచారానికి ఒడిగట్టాడని తెలిపారు. బీజేపీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పోక్సో కేసులో నిందితుడైన భగీరథ్‌ను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని.. బాధితురాలికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. హైదరాబాద్ చిలుకానగర్‌లో బండారి లక్ష్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. బండి సంజయ్, రేవంత్‌రెడ్డి కుమ్మక్కై డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మైనర్ బాలికకు న్యాయం చేయకుండా, బండి కుమారుడిని కాపాడేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో పేదలకు ఒక న్యాయం.. పెద్దలకు ఒక న్యాయమా అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోక్సో కేసులో బండి సంజయ్‌కు సహకరిస్తుందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. బండిసంజయ్ కుమారుడిపై పోక్సో కేసు నమోదైనా అరెస్టు చేయడం లేదని మండిపడ్డారు. బాలికపై హనీట్రాప్, వసూళ్ల కేసు ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. ప్రధాని మోదీ బేటీ బచావో కేవలం నినా దానికే పరిమితమా అని నిలదీశారు. బండి సంజయ్ కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలని బండారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని బాధిత కుటుం బానికి న్యాయం చేయాలన్నారు.

# బండి కుమారుడి కేసుపై సిఎం సీరియస్

**విచారణకు డిజిపిని ఆదేశించిన రేవంత్**

**సిట్ ఏర్పాటు చేస్తూ డిజిపి ఉత్తర్వులు**

**హైదరాబాద్,మే11 :** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసుపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. భగీరథ్‌పై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుపైన తక్షణమే విచారణ మొదలుపెట్టాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను సీఎం ఆదేశించారు. మే 8న ఫిర్యాదు వస్తే ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని డీజీపీని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. కేసు వివరాలను సీఎంకు డీజీపీ వివరించారు. ప్రధాన మంత్రి మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో పోలీస్ సిబ్బంది అంతా భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారని తెలియజేశారు. కేసు సమగ్ర విచారణ కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని డీజీపీ ఆనంద్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బండి భగీరథ్‌పై ఈనెల 8న పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఓ ఫిర్యాదు వచ్చింది. తనను భగీరథ్ వేధిస్తున్నారని, పోక్సో కింద కేసు నమోదు చేయాలని ఓ మైనర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇప్పటి వరకు భగీరథ్‌పై పోలీసు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పాటు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయనట్లు తెలుస్తోంది. ఈ అంశం తెలంగాణ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కేంద్ర మంత్రి కుమారుడిని ప్రభుత్వమే కాపాడుతోందంటూ ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్న పరిస్థితి నెలకొంది. తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కుమా రుడి కేసులో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ కేసును సమగ్రంగా విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేస్తూ తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు ప్రస్తుతం రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ కేసు సున్నితమైనది కావడంతో దర్యాప్తును మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. బాధితురాలు బాలిక కావడం, ఈ కేసులో ఉన్న ఆరోపణల తీవ్రత దృష్ట్యా విచారణలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సిట్ బృందం ఇప్పటికే కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరించే పనిని ప్రారంభించినట్లు సమాచారం. పోలీసులు బాలిక స్టేట్మెంట్‌ను చట్టపరమైన నిబంధనల ప్రకారం రికార్డ్ చేశారు. ఈ ప్రకటన ఆధారంగా మరిన్ని అంశాలను వెలికితీసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. విచారణలో భాగంగా సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటా, డిజిటల్ ఆధారాలు కూడా పరిశీలించే అవకాశముంది. ఈ ఘటనపై హైదరాబాద్ పరిధిలోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై కేసు నమోదు చేశారు. బాలిక ఫిర్యాదు, ప్రాథమిక ఆధారాల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. పోలీసులు పోక్సో చట్టం సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం.

# మోర్తాడ్‌లో రైతుల రహదారి ధర్నా

- ధాన్యం కొనుగోళ్లు,తరుగుదోపిడీపై నిరసనలు
- అధికారులు స్పందించడం లేదన్న మాజీమంత్రి వేముల



**నిజామాబాద్,మే11:** ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా చేపట్టాలని, తరుగు దోపిడీని అరికట్టాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో సోమవారం రైతులతో కలిసి జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్య లపై కలెక్టర్‌కు, మంత్రులకు ఎన్నిసార్లు ఫోన్ చేసి నా స్పందించడం లేదన్నారు. దొడ్డు రకం ధాన్యా నికి గ్రేడ్ వన్ ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కల్లాల్లో ధాన్యాన్ని తరలించేందుకు లారీల కొరన్న తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరిం చారు. వడ్ల కొనుగోళ్ల ప్రక్రియ నత్తనడకన సాగు తున్నదని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. పంటను అమ్ము కోవడానికి రైతులు నెలరోజులుగా ఇబ్బందులు పడుతున్నారని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని మండిపడ్డారు. మూడు రోజులుగా పలు కొనుగోలు కేంద్రాలను స్వయంగా సందర్శించానని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావడానికి రైతు నిరసన, ధర్నా కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేస్తామని ప్రకటించి కేంద్రాలు తెరిచే సరికి 15 రోజులు, గన్నీ బ్యాగులు వచ్చేసరికి వారం, కాంటా పెట్టేసరికి మరో వారం అన్నట్లుగా 20 రోజుల పాటు కావాలనే జాప్యం చేసిందని ఆరోపించారు. మద్దతు ధర రూ. 2,390 ఉండగా ప్రభుత్వ జాప్యం భరించలేక రైతులు గత్యంతరం లేక ప్రైవేట్ వ్యక్తులకు రూ. 1,750 నుంచి రూ. 1900లకే అమ్ముకుంటున్నారని, దీంతో ఎకరా కు సుమారు రూ. 15వేలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్‌మిల్లర్లు ప్రభుత్వాన్ని శాసిస్తున్నారని, తరుగు పేరుతో 40 కిలోలకు 5 కిలోల అదనపు వడ్లు (క్వింటాలుకు 12.5 కిలోలు) దోచుకుంటున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఇది కేవలం 1.5 కిలోలు మాత్రమే ఉండేదని గుర్తు చేశారు. రైతుల సమస్యలపై మాట్లాడేందుకు కలెక్టర్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదని, కనీసం స్పందించే తీరిక కూడా లేదని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వ పాలసీలో భాగమేనని పేర్కొన్నారు. వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలని, రవాణాకు లారీలను పెంచాలని, గన్నీ బ్యాగుల కొరత తీర్చాలని, తరుగును తగ్గించి, పాత పద్ధతిలోనే వడ్లు సేకరించాలని, దొడ్డు రకానికి గ్రేడ్ -1 రేటుతో పాటు రూ. 500 బోనస్ వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన పోరాడేందుకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి రైతులకు న్యాయం చేసే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు.

# మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి

- సభ్యులులుగా శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ
- మరో సహభ్యురాలుగా చాకలి ఐలమ్మ మనవరాలు



**హైదరాబాద్,మే11 :** తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు ప్రభుత్వం కొత్త నియామకాలు చేపట్టింది. మహిళా హక్కుల పరిరక్షణ, మహిళా సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం కీలకమైన తెలం గాణ మహిళా కమిషన్‌కు చైర్ పర్సన్‌గా మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని నియమించింది. అలాగే కమిషన్ సభ్యులుగా ప్రభుత్వం పలువురు ప్రముఖ మహిళలకు అవకాశం కల్పించింది. ఈ నియామకాల్లో తెలంగాణ ఉద్యమం, సామాజిక సేవ,మహిళా హక్కుల ఉద్యమాల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంతచారి తల్లి కాసోజు శంకరమ్మను మహిళా కమిషన్ సభ్యురాలిగా రేవంత్‌రెడ్డి సర్కార్ నియమించింది. తెలంగాణ ఉద్యమ సమయంలో శ్రీకాంతచారి త్యాగం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఈ నియామకంతో తెలంగాణ ఉద్యమ కుటుంబాలకు ప్రభుత్వం గౌరవం ఇచ్చినట్లయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మనవరాలు చిట్యాల శ్వేతను కూడా కమిషన్ సభ్యురాలిగా కాంగ్రెస్ సర్కార్ నియమించింది. చాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో కీలక వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఆమె కుటుంబానికి ఈ నియామకంతో ప్రాధాన్యం సంతరించుకుంది. మహిళా కమిషన్ సభ్యులుగా శశికళ యాదవ్ రెడ్డి, సదాలక్ష్మి, రాధాభాయి, ఉజ్మా షకీరాలను కూడా ప్రభుత్వం నియమించింది. వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా ఈ నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తోందని, మహిళల సమస్యల పరిష్కారంలో కమిషన్ కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు.

# ఆరోగ్యశాఖలో 1919 నర్సింగ్ ఆఫీసర్ నియామకం

**మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**హైదరాబాద్,మే11 :** ఇంటర్నేషనల్ నర్సెస్ డే సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో నర్సింగ్ నియామకాలు చేపట్టింది. రాష్ట్ర ఆరోగ్యశాఖలో ఎంపికైన 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు మంగళవారంఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ నియామక పత్రాలను అందజేయనున్నారు. ఈ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో మంగలశారం సాయంత్రం 4గంటలకు నిర్వహించనున్నారు. భారీసంఖ్యలో అభ్యర్థులు హాజరుకానుండటంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, కూర్చునే సదుపాయం, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేకదృష్టి పెట్టాలని మంత్రి దామోదర్ రాజ నర్సింహ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న 1919 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తోంది. వీరితో పాటు లేబర్ డిపార్ట్‌మెంట్‌లో మరో 257 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. ఈ నియామక ప్రక్రియను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డుద్వారా నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు పారదర్శకంగా నియామక పత్రాలు అం దజేస్తున్నట్లుఅధికారులుతెలిపారు. తెలంగాణలో నర్సింగ్ రంగంలో భారీ స్థాయిలో ఉద్యోగావకాశాలు కల్పించడంద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని ప్రభుత్వం పేర్కొంది. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది కొరతను తగ్గించేం దుకు ఈ నియామకాలు కీలకంగా మారనున్నాయి. కొ త్తగా నియమితులయ్యే నర్సింగ్ ఆఫీసర్లు రాష్ట్రవ్యా ప్తంగా వివిధ ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలు అందించను న్నారు. ఈ నియామకాలతో ప్రభుత్వ వైద్యసేవలు మ రింత బలోపేతం అవుతాయని ఆరోగ్యశాఖ అధికారు లు భావిస్తున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారనిఅధికారులు చెబుతున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలను విస్తరించేందుకు కొత్తగా నియమితులయ్యే నర్సింగ్ ఆఫీసర్లు ఉపయో గపడనున్నారని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ నర్సెస్ డే సందర్భంగా ఈ నియామక పత్రాల పంపిణీ కార్యక్ర మాన్ని నిర్వహించడం విశేషంగా మారింది. కరోనా కాలంలో నర్సులు అందించిన సేవలను ప్రభుత్వం గుర్తు చేసుకుంటూ, ఆరోగ్యరంగంలో వారి పాత్ర ఎం తో గొప్పదని పేర్కొంది. ప్రజారోగ్య పరిరక్షణలో నర్సులు ముందుండి సేవలందిస్తున్నారని, సేవలను గౌరవించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

# కొలరాడో రాష్ట్రంలో షాకింగ్ ఘటన

**విమానం టేకాఫ్ అవుతుండగా దగ్గరగా వెళ్లిన వ్యక్తి**

**వ్యక్తిని లాగేసుకున్న విమాన ఇంజన్**

**న్యూయార్క్,మే11 :** అమెరికాలోని కొలరాడో రాష్ట్రంలో షాకింగ్ ఘటన జరిగింది. డెన్వర్‌లోని డెన్వర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఫ్రాంటియర్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఫ్రాంటియర్ ఎయిర్‌లైన్స్ విమానం టేకాఫ్ అవుతున్న సమయంలో రన్‌వే దాటుతున్న ఓ వ్యక్తి ఒక్కసారిగా భద్రతా కంచెను దూకి విమానానికి అత్యంత సమీపంగా చేరుకున్నాడు. అదే సమయంలో టేకాఫ్ కోసం వేగం పెంచుతున్న ఎయిర్‌బస్ విమానం ఇంజిన్ అతడిని ఒక్కసారిగా లోపలకు లాగేసుకుంది. ఈ ఘటనలో ఆ వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అతడి శరీరం పైభాగం ఇంజిన్‌లో ఇరుక్కుపోవడంతో పరిస్థితి మరిం త భయానకంగా మారింది. అనంతరం ఇంజిన్ నుంచి భారీగా మంటలు వెలువడ్డాయి. సమాచారం మేరకు ? ఈ ఘటన జరిగిన సమయంలో విమానం సుమారు గంటకు 139 మైళ్ల వేగంతో టేకాఫ్ దశలో ఉంది. ఈ దృశ్యాన్ని చూసిన విమానంలోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇంజిన్‌లో మనిషి కాళ్లు కనిపించడంతో పాటు పెద్ద శబ్దాలు, మంటలు వెలువడటంతో విమానంలో కలకలం రేగింది. తక్షణమే అప్రమత్తమైన సిబ్బంది టేకాఫ్‌ను నిలిపివేసి అత్యవసర చర్యలు చేపట్టారు. అనంతరం విమానంలో ఉన్న ప్రయాణికులు, సిబ్బందిని సురక్షితంగా కిందకు దించారు. ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

# బీబీపేట శివారులో చిరుత సంచారం

**లేగదూడ చంపడంతో రైతుల ఆందోళన**

**సంగారెడ్డి,మే11 :** సంగారెడ్డి జిల్లాలోని కల్హేర్ మండలం బీబీపేట గ్రామ శివార్లలో చిరుత పులి సంచారం స్థానిక ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో చిరుత కదలికలు ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో.. తాజాగా ఓ రైతు పొలంలో లేగ దూడపై దాడి చేయడంతో గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు. బీబీపేట గ్రామానికి చెందిన ఓ రైతు తన వ్యవసాయ పొలం వద్ద పశువులను కట్టేయగా.. అర్ధరాత్రి సమయంలో చిరుత పులి దాడి చేసింది. ఈ దాడిలో ఒక లేగదూడ మృతి చెందింది. ఉదయం పొలానికి వెళ్లిన రైతు.. లేగ దూడ చనిపోయి ఉండడాన్ని చూసి షాక్‌కు గురయ్యారు.చిరుత అడుగుజాడలను గమనించిన ఆయన వెంటనే గ్రామస్థులు, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చిరుత సంచారం ఉన్న మాట వాస్తవమేనని ద్రువీకరించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి వేళల్లో ఒంటరిగా పొలాలకు వెళ్లవద్దని హెచ్చరించారు. ఇదిలా ఉంటే.. కల్హేర్ అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల్లో గత కొన్ని రోజులుగా చిరుత సంచరిస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పుడు ఏకంగా ఊరికి సమీపంలోని పొలాల్లోకి వచ్చి పశువులను చంపుతుండటంతో, రాత్రి వేళల్లో పొలాలకు వెళ్లాలంటేనే రైతులు వణికిపోతున్నారు.


# లంచం కేసులో కార్యదర్శి పట్టివేత

**సహకరించిన సర్పంచ్ భర్త కూడా అరెస్ట్**

**సిద్దిపేటమే11 :** లంచిం మేసిన మరో ప్రభుత్వ ఉద్యోగని ఎసిబి పట్టుకుంది. బాధితుడి ప్లాట్‌లో నుంచి వెళ్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ ను తొలగించేందుకు లంచం తీసుకున్న పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి గడ్డం రాజాగౌడ్ రూ. 10 వేలు తీసుకుంటూ పట్టుబడ్డారు. మధ్యవర్తిగా ఉన్న సర్పంచ్ భర్త గొల్లపల్లి ఆంజనేయులును సైతం పట్టుకుని కేసు నమోదు చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి హైదరాబాద్ కోర్టులో హాజరుపరిచామని ఏసీబీ అధికారులు వివరించారు.

# 13న పాలిటెక్నిక్ ప్రవేశ రీక్ష

**పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి**



**హైదరాబాద్,మే11 :** రాష్ట్రంలో ఈనెల 13న నిర్వహించనున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకుఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ,ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ, ఉద్యానవన , వెటర్నరీ డిప్లొమా కోర్సుల ప్రవేశానికి ఉదయం 11 గంటల నుంఇ మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 56,494 మంది విద్యార్థులు, 49,945 మంది విద్యార్థినులు పరీక్షలకు దరఖాస్తులు చేసుకున్నారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 293 పరీక్ష కేంద్రాను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు పరీక్ష సమయానికి గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్ కానీ, ఏ ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులను అనుమతించబోమని వివరించారు.

# సికింద్రాబాద్ యువకుడి హత్యకేసు

**10మంది నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు**

**యువతితో ప్రేమాయణమే కారణమన్న డిసిపి**



**హైదరాబాద్, మే11 :** సికింద్రాబాద్ చిలకలగూడ ప్రాంతంలో రెండు రోజుల క్రితం యావన్ అనే యువకుడు హత్యకు సంబంధించిన కేసులో పురోగతి సాధించారు. యావన్ తన స్నేహితులతో కలిసి చిలకలగూడలో ఓ ఇంట్లో క్రికెట్ మ్యాచ్ చూస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి కత్తులతో దాడి చేశారు. తల, గొంతు, శరీరభాగాల్లో తీవ్రమైన కత్తిపోట్లు కావడంతో యావన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనపై కేసు నమోదు చేసి న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తాజాగా యావన్ హత్యకు సంబంధించిన వివరాలను సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షితా మూర్తి వెల్లడించారు. ఈనెల 7వ తేదీన చిలకలగూడ పీఎస్ ప్రాంతంలో జరిగిన యావన్ హత్య కేసులో 10 మంది నిందితులను అరెస్ట్ చేశామని అన్నారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టాం. కేసు విచారణ కోసం ఐదు బృందాలను ఏర్పాటు చేశాం. ఈ కేసులో సాయి కిరణ్ మొదటి నిందితుడు. అతడే యావన్ హత్యకు ప్లాన్ చేశాడు. అరెస్టైన వారి లో యువతి తండ్రి నరసింహ యాదవ్, బాబాయ్‌లు మల్లేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్ ఉన్నారు. వీరితో పాటు అమ్మాయి బ్రదర్ పరమేష్ , అలానే ఓ మైనర్ కూడా ఉన్నాడు' అని డీసీపీ రక్షితా మూర్తి తెలిపారు. పక్కా ప్లాన్ చేసి.. యావన్‌ను హత్య చేశారు. హత్యకు నాలుగు రోజుల ముందు నుంచే యావన్‌ను చంపేందుకుప్లాన్ చేశారు. మేడిబావి ప్రాంతానికి వస్తే యావన్‌ను హత్య చేయడానికి ప్లాన్ చేసుకున్నారు. 7వ తేదీన యావన్ తన స్నేహితుడైన సుబ్బు ఇంటికి వచ్చాడు. అదే సమయంలో గ్యాంగ్ వచ్చి యావన్‌తో గొడవ పడ్డారు. ఆ సమయంలో ఒకరు కత్తితో యావ న్‌ను పొడిచారు. అనంతరం మిగిలిన నిందితులు కూ డా యావన్‌ను కత్తితో పొడిచారు. తీవ్రంగా గాయపడి యావన్‌ను స్నేహితులు గాంధీ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు చెప్పారు' అని డీసీపీ వెల్లడించారు. యావన్‌కు ఒక యువతితో స్కూల్ డేస్ నుంచి పరిచయం ఉంది. గత రెండేళ్లుగా ఇద్దరు ప్రేమలో ఉన్నారు. వారి ప్రేమ విషయం యువతి తల్లి దండ్రులకు నచ్చలేదు. దీంతో అతన్ని హెచ్చరించారు. అయినా యావన్ అలానే అమ్మాయితో ప్రేమ కొనసా గించాడు. నిందితుల నుంచి హత్యకు ఉపయోగించిన కత్తితో పాటు ద్విచక్ర వాహనం మొబైల్ ఫోన్లు సీజ్ చేశాం. నిందితులకు డ్రగ్స్ టెస్టులు నిర్వహించాం. అందులో రాహుల్, శివలకు గంజాయి పాజిటివ్ వచ్చింది' అని డీసీపీ రక్షితా మూర్తి తెలిపారు.

# నైపుణ్య కేంద్రాలుగా లేబర్ అడ్డాలు



- **చంద్రబాబు ఆలోచనతో మారనున్న జీవితాలు**
- **అసంఘటితరంగ కార్మికులకు పనిభరోసా**
- **కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్**

**విజయవాడ,మే11 :** లేబర్ అడ్డాలు కేవలం పనికోసం వేచిచూసే ప్రదేశాలు కావు, అవి శ్రమజీవుల ఆత్మగౌరవానికి, స్వాభిమానానికి ప్రతీకలుగా నిలిచేలా తీర్చిదిద్దుతు న్నామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కష్టజీవుల ఆత్మవిశ్వాసాన్ని నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేబర్ అడ్డాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. వారికి నైపుణ్య శిక్షణ ఇప్పించడం ద్వారా నిష్ణాతులను చేయాలన్న సంకల్పం ఉందన్నారు. . రాష్ట్రంలో 80 లక్షల మంది అసంఘటిత కార్మికుల సమ స్యలకు పరిష్కార మార్గంగా, వారిని గౌరవప్రదమైన జీవనం వైపు నడిపించే కేంద్రాలుగా ఈ అడ్డాలు మారబోతు న్నా యన్నారు. మేడే రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు కృష్ణా జిల్లా పమిడిముక్కలో ఈ లేబర్ అడ్డాను లాంఛనంగా ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని 15 నగ రాల్లో ఈ అడ్డాలను నిర్మిస్తున్నారు. రాబోయే రోజుల్లో వీటిని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా మార్చనున్నారు. స్కిల్డ్, అన్ స్కిల్డ్ కార్మికులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులిస్తారు. తద్వారా వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి స్కిల్డ్ లేబర్‌గా తయారు చేస్తారు. ఇప్పటికే నైపుణ్యం ఉన్న వారికి కూడా మరింత శిక్షణ ఇచ్చి హైపవర్ స్కిల్డ్ లేబర్‌గా గుర్తిస్తారు. తద్వారా కార్మికుల సంక్షేమం, జీవితాలను సమూలంగా మార్చాలన్నది చంద్రబాబు ఉద్దేశం అని వివరించారు. అంతేకాకుండా ఈఎస్ఐ ఆస్పత్రుల ద్వారా వీరికి మెరుగైన వైద్యం అందిస్తారు.కార్మికుల సేవలు అవసరమైన ప్రజలు నేరుగా లేబర్ చౌక్‌కు వెళ్ళి సంప్ర దించొచ్చు. అంతేకాకుండా కార్మికులకు పక్కా చిరునామా, వీరందరి కోసం తగిన సదుపాయాలతో ప్రత్యేక భవనాలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది. అందుకు సంబంధించి స్థల సేకరణ కూడ జరుగుతున్నది. లేబర్ అడ్డాల్లో మౌలిక సదుపా యాల కల్పనకు రూ.15 లక్షలు చొప్పున ఖర్చు చేస్తారు. వీటిలో తాగునీటి సదుపాయం, పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, వంద నుంచి రెండు వందల మంది కూర్చోవడానికి వీలుగా ఏర్పాట్లు చేస్తారు.. తెల్లవారుజామునే లేచి, ఎండనక, వాననక పని కోసం రోడ్డె క్కి, ఆత్మవిశ్వాసంతో కష్టపడే శ్రామికులకు నైతిక బలం ఈ అడ్డాలు. కూటమి ప్రభుత్వం కార్మికుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు లేబర్ అడ్డాల వద్ద ఆధునిక వసతులు, విశ్రా ంతి గదులు కల్పించాలని నిర్ణయించిందన్నారు. ఉన్న ఊరి లో ఉపాధి లేక పట్టణాలకు వలసపోయి అడ్డా కూలీలుగా మారిన ఉదంతాలు కోకొల్లలు, గ్రామాల నుంచి పని కోసం నగరంలోని కూలీ అడ్డాకు తరలివచ్చేవారు. ప్రతిపక్ష నాయకుడుగా రాష్ట్రంలో పర్యటించినప్పుడు కుటుంబాన్ని పోషించడానికి ఆ కష్టజీవులు పడుతున్న తపనకు పరిస్కారం చూపాలనే ఆలోచన ముఖ్యమంత్రి చంద్రబాబు మదిలో మెదిలింది. నిరుపేద కుటుంబాలు మనుషులుగా తల ఎత్తుకుని బతికినప్పుడే కదా అభివృద్ధి అని ఆయన భావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ కూలీలకు ఏదో ఒక ప్రయోజనం చేకూర్చి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా కార్యాచరణ ప్రణాళికకు రూపకల్పన ప్రారంభించింది. ఆ ప్రణాళికకు అనుగుణంగా భవన నిర్మాణ కార్మికులు పనుల కోసం రోజూ ఉదయం రోడ్లపక్కన వేచి చూసే పని లేకుండా లేబర్ అడ్డాలకు శ్రీకారం చుట్టిందన్నారు. వచ్చే ఏడాదిలో రాష్ట్రానికి మరిన్ని ప్రైవేట్ కంపెనీలు రానున్నాయి. ఆయా కంపెనీల నిర్మాణాలు సాగేటప్పుడు వారికి నైపుణ్యం ఉన్న కార్మికులు కావాల్సి ఉంటుంది. ఈ క్రమంలో రాష్ట్రంలో నైపుణ్యం ఉన్న కార్మికు లను పెంచడం ద్వారా పెట్టుబడిదారులు వేర్వేరు ప్రాంతాల నుంచి కార్మికులను తెచ్చుకోకుండా స్థానికు లకు ఉపాధి కల్పించాలనేది చంద్రబాబు నాయుడు ఆలోచన. ఆ దిశగా అడుగులు వేయడం వల్ల కార్మికులకు మేలు జరుగుతుందని, రాష్ట్రానికి కూడా ఉపయోగపడుతుందనే ముందు చూపుతోనే ఆయన లేబర్ అడ్డాలకు శ్రీకారం చుట్టారు. గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగా కార్మికుల సంక్షేమం కోసం కబుర్లు చెబుతూ కాలక్షేపం చేయకుండా వారి కోసం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టడం కూటమి ప్రభుత్వం పనితీరుకు నిదర్శనం అని వాసంశెట్టివివరించారు.

# అభివృద్ధికి కేంద్ర సహకారం తప్పనిసరి

మోదీ అంగీకరించారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర సహకారం అవసరమని, అదే విషయాన్ని మోదీ దృష్టికి తాను తీసుకెళ్లానని చెప్పుకొచ్చారు. 'నేను బీజేపీని ఓడించిన ముఖ్యమంత్రిని...కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని పరిగణనలోకి తీసుకో వాల్సిందే' అని వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం కేంద్రాన్ని నిధులు అడగలేదని, తాము మాత్రం తెలంగాణ హక్కుల కోసం అడుగు తున్నామని పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ప్రధాని మోదీ సమావేశం కావడం ప్రైవేట్ కార్యక్రమమని చెప్పుకొచ్చారు. అలాగే తమతో కలిసి రావాలన్న ప్రధాని మోదీ పిలుపును స్వాగతిస్తున్నామని తెలిపారు. ప్రధాని అధి కారిక కార్యక్రమంలో పాల్గొన్నానని, ఆయన పిలుపులో రాజకీయాలకు తావులేదని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమంలో కేంద్రంతో కలిసి వెళ్లేందుకు తనకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. వికసిత్ భారత్‌లాగే విజన్ 2047 సాధనకు, 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ అందుకునేందుకు కేంద్రంతో కలిసి నడుస్తామ న్నారు. కేంద్రం, రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో ముందుకెళ్లాలని తెలిపారు. తమ పార్టీలు, ఐడి యాలజీ వేరైనా.. అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామన్నారు. ఎన్నోసార్లు కలిసినా.. కేంద్రం నుంచి ఆశించిన మద్దతు రాలేదని, 2 గంటలు సమయమిస్తే తమ ప్రణాళికలు ప్రధానికి వివరిస్తామని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వం 50 శాతం నిధులు ఇవ్వాలని కోరామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మెట్రో, సదరన్ పార్ట్ రీజినల్ రింగ్ రోడ్ వంటి కొన్ని ప్రాజెక్టులు ఇంకా పెం డింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఎయిర్‌పోర్ట్ క్లియరెన్స్‌లు, డిఫెన్స్ ల్యాండ్స్, మూసీ ప్రాజెక్టుకు ఏడీబీ నిధులు, నేషనల్ హైవేలకు అనుమతులు వచ్చినట్లు వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ పనులు ఆలస్యమయ్యాయని ఆరోపించారు. 2034 నాటికి తెలం గాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని తాను ప్రధాని మోదీని కోరగా ఆయన అంగీ కరించారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీని 'బ్రిటిష్ జనతా పార్టీ'గా సీఎం రేవంత్‌రెడ్డి అభి వర్ణించారు. విభజించి పాలించడం ఆ పార్టీ సిద్ధాంతమని ఆరోపించారు. అనుభవరాహిత్యం, అహం కారం వల్లనే దేశాన్నిసంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు. ఎస్ఐఆర్‌ను బీజేపీ ఆయుధంగా ఉపయోగిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు.జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ రాలేదని.. మున్సి పాలిటీ ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి ఏమిటని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ రెండు సీట్లతో ప్రారంభమైందని..అక్కడికే వస్తుందని విమర్శించారు. కాంగ్రెస్‌ను మోదీ విమర్శిస్తే తనను విమర్శించినట్లేనని అన్నారు. కేంద్రం నుంచి తెలంగాణకు ఆశించిన మేరకు సహకారం లేదని చెప్పారు. బీజేపీకి ప్రజాస్వామ్యంపైన నమ్మకం లేదని మండిపడ్డారు. తమిళనాడులో అతిపెద్ద పార్టీకి ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్ ఆహ్వానించకుండా నిర్లక్ష్యం ఎందుకు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ జపం చేయకుండా బీజేపీ బతకదని విమర్శించారు.ప్రధాని మోదీ మాట్లాడిన కొన్ని మాటలు దురదృష్టకరమని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. బంగారం కొనొద్దు, విమానాల్లో ప్రయాణం చేయొద్దని ప్రజలకు చెప్పడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. విదేశాంగ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రతిపక్షాల సూచనలు తీసుకోవాలని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని కేంద్రానికి సూచించారు. మోదీ అనుభవరాహిత్యం, అహంకారం వల్ల దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై కూడా సీఎం రేవం త్‌రెడ్డి విమర్శలు చేశారు. గతంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఫిర్యాదు చేసిన ఆయనే తర్వాత ప్రభా కర్ రావును నీతిమంతుడని చెప్పారని గుర్తుచేశారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ దగ్గర ఆధారాలు ఉంటే పోలీస్ కమిషనర్‌కు ఇవ్వొచ్చని.. మైక్‌ల ముందు స్టేట్‌మెంట్లు ఇవ్వడం వల్ల విచారణ జరగదన్నారు. కేటీఆర్ బామ్మర్ది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ తీసుకుని దొరికినా తాము వదల్లేదని తెలిపారు. ఖాళీగా ఉన్నామని కేటీఆర్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పోలీసుల డ్యూటీ చేస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. గడీలు బద్దలు కొడతానని గతంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చెప్పారని ప్రస్తావించారు. అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అయినప్పటికీ తడిసిన ధాన్యాన్ని కూడా తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని చెప్పారు. పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించేందుకు విస్తృత చర్చలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు వివరణ ఇచ్చే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. యూరియా కేంద్రం ఇవ్వాలని.. రాష్ట్ర ప్రభుత్వం పంచాలని తెలిపారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు అంశంపై ఇప్పటికే మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మహారాష్ట్ర సీఎం స్పందించేలా చూడాలని ప్రధాని మోదీకి కూడా లేఖ పంపినట్లు చెప్పారు. రెండు రాష్ట్రాల మధ్య సమస్యలు వచ్చినప్పుడు ప్రధాని పెద్దరికం వహిస్తే మంచిదని వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ద్వారా కూడా చర్చలు జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

# మహానాడుకు చురుకుగా ఏర్పాట్లు


- **నేతలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నారాయణ**



**నెల్లూరు,మే11:** ఈనెలాఖరులో ప్రారంభమయ్యే పార్టీ మహానాడుకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమం జరగనున్న కిసాన్ సేజ్ ప్రాంతాన్ని పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పరిశీలించారు. సభాప్రాంగణం, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష చేశారు. మూడు రోజుల పాటు జరిగే మహానాడులో కీలక తీర్మానాలు చేస్తారని మంత్రి నారాయణ తెలిపారు. 'మహానాడు సుపరిపాలనకు దోహదపడే విధంగా నిర్వహించాలి. తొలిరెండు రోజులు పార్టీ డెలిగేట్స్‌తో, మూడో రోజు బహిరంగ సభగా జరగనుంది. బహి రంగ సభకు 7 లక్షల మందికి పైగా ప్రజలు రాబోతారని అంచనా. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. కమిటీల ప్రతినిధుల సమావేశంలో బాధ్యతలపై దిశా నిర్దేశర చేస్తాం. మహానాడును చరిత్రలో నిలిచేలా నిర్వహిస్తాం' అని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ..'సభా ప్రాంగణం, పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించాం. మహానాడుకు సుమారు 6 వేల బస్సులు రావచ్చని అంచనా. పోలీసులు భద్రతా ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. తెలుగు ప్రజల పండగ అయిన మహానాడును నిర్వహించే తొలి అవకాశం నెల్లూరు జిల్లాకు దక్కింది' అన్నారు. 'రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలంతా 26న మహానాడు ప్రాంగణానికి రానున్నారు. కమిటీల బాధ్యతలపై నిర్ణయాలు తీసు కుంటారు. కార్యకర్తలు ఈ మహానాడును ఇంటి కార్యక్రమంలా భావించి సమర్పణతో పనిచేయాలి' టీడీపీ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తెలిపారు. కిసాన్ సేజ్‌లో ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. జిల్లా పార్టీ నేతలందరూ తెలుగు పండగ విజయవంతం చేయాలని కృతనిశ్చయంతో ఉన్నారు.

# భారతదేశ సాంకేతిక సామర్థ్యం ప్రపంచానికి చాటింది

**శాస్త్రవేత్తలు, ఇన్నోవేటర్లు చంద్రబాబు శుభాకాంక్షలు**



**అమరావతి,మే11 :** జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా శాస్త్రవేత్తలు, ఇన్నోవేటర్లు, యువతకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. పోఖ్రాన్ విజయంతో భారతదేశ సాంకేతిక సామర్థ్యం ప్రపంచానికి చాటిందని పేర్కొన్నారు. జ్ఞానం, పరిశోధన, ఆవిష్కరణల ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు. భవిష్యత్తు టెక్నాలజీల కోసం ఆంధ్రప్రదేశ్‌లో బలమైన ఎకోసిస్టమ్ నిర్మించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్ర యువతను ప్రపంచ స్థాయి సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దేందుకు భారీ స్థాయిలో డీప్‌టెక్ స్కిల్లింగ్ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర యువతకు క్వాంటమ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి అత్యాధునిక రంగాల్లో శిక్షణ అందించ నున్నట్లు సీఎం చెప్పుకొచ్చారు. 2026-27 నాటికి రెండు లక్షల మందికి శిక్షణ ఇవ్వాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని 10 లక్షల మం దికి విస్తరించే ప్రణాళికను రూపొందిస్తున్నా మని అన్నా రు. డిజిటల్ లెర్నింగ్, ఇండస్ట్రీ ట్రైనింగ్, గ్లోబల్ సర్టిఫికేషన్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వెల్లడించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నీలిట్, ఇన్నోవేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కేంద్రంలోక్వాంటమ్‌కంప్యూటింగ్, ఏఐ, సెమీకండక్టర్ టెక్నాలజీలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ విద్యా సంవత్సరం నుంచే కార్యకలాపాలు ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. విద్యార్థులు, పరిశోధకులకు వరల్డ్ క్లాస్ ల్యాబ్స్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఎన్‌పిటెల్ జాతీయ పరీక్షల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు 4 గోల్డ్, 14 సిల్వ ర్ మెడల్స్ సాధించడం రాష్ట్ర ప్రతిభకు నిదర్శనమని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. ఆధునిక టెక్నా లజీ కోర్సుల్లో మరింత మంది విద్యార్థులు పాల్గొని ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. క్వాంటమ్ వ్యాలీ విజన్ ద్వారా భవిష్యత్ టెక్నాలజీలకు సిద్ధమయ్యే రాష్ట్రంగా ఆం ధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రపంచ స్థాయి పరిశోధన, సాంకేతిక నైపుణ్యాలు, స్టార్టప్ అవకాశాలు, ఇండస్ట్రీ కనెక్టివిటీతో ఏపీని టెక్నాలజీ హబ్‌గా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర యువతలో నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా ప్రపంచ మార్కెట్ అవసరాలకు తగిన మానవ వనరులను తయారు చేయాలని తమ ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# కైలాసగిరిపై త్రిశూల్ ఏర్పాటు శుభపరిణామం




**'స్వాభిమాన్ పర్వ' కార్యక్రమంలో బిజెపి అధ్యక్షుడు మాధవ్**

**విశాఖపట్నం,మే11 :** విశాఖలోని కైలాసగిరిపై త్రిశూలాన్ని ఏర్పాటు చేయడం ఒక శుభ పరిణామమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. నగరంలోని కైలాసగిరి వేదికగా జరిగిన 'స్వాభిమాన్ పర్వ' కార్యక్రమం ఆధ్యాత్మికత, జాతీయ భద్రత అంశాల కలయికగా సాగింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు పి.వి.ఎన్ మాధవ్, ఇతర ముఖ్య నేతలు పాల్గొని, దేశం ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిణామాలు, సాంస్కృతిక పునరుజ్జీవనంపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పి.వి.ఎన్ మాధవ్ మాట్లాడుతూ.. 'సింహాచలం క్షేత్రంలో భాగమైన కైలాసగిరిని ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దే క్రమంలో చేపట్టిన త్రిశూల్ ప్రాజెక్ట్ అభినందనీయం. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ స్వాభిమాన్ జాగరణ కేవలం ఆధ్యాత్మికతకే పరిమితం కాకుండా, దేశ రక్షణ అంశాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్తోంది. గత పన్నెండేళ్ల కాలంలో పఠాన్‌కోట్ మినహా దేశంలో పెద్దగా ఉగ్రవాద ఘటనలు చోటుచేసుకోకపోవడం.. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాయకత్వంలో అంతర్గత భద్రత ఎంత పటిష్టంగా ఉందో నిరూపిస్తోంది. ముఖ్యంగా 'ఆపరేషన్ కగార్' ద్వారా దేశవ్యాప్తంగా తీవ్రవాద ఏరివేత ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. ఎన్డీయే హయాంలో దేశ సరిహద్దులు మరింత సురక్షితంగా మారాయని అన్నారు.

# దస్తగిరి హత్య కేసులో ఎస్పీ కార్యాలయంలో లొంగిపోయిన నిత్యానందరెడ్డి

**కడప,మే11 :** వైసీపీ నేత, కడప మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి లొం గిపోయారు. వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి హత్య కేసులో నిత్యానంద రెడ్డి ప్రధాన నిందితుడిగా ఉన్నా రు. గత 20 రోజు లుగా వైసీపీ నేత కోసం తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో పోలీసులు గాలిస్తున్నారు. ఎట్టకేలకు సోమవారం ఉదయం ఎస్పీ కార్యాలయంలో పోలీసుల ఎదుట నిత్యానంద రెడ్డి లొంగిపోయారు. కొద్దిరోజుల క్రితం కడపలో వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి దారుణ హత్యకు గురయ్యారు. హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు దాదాపు 11 మందిని అరెస్ట్ చేశారు. నిత్యానంద రెడ్డి చెప్పడం వల్లే దస్తగిరిని చంపినట్లు నిందితులు వాంగ్మూలం ఇచ్చారు. దీంతో ఈ కేసులో నిత్యానంద రెడ్డిని ప్రధాన నిందితుడిగా పోలీసులు చేర్చారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిత్యానంద రెడ్డి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిత్యానందరెడ్డి నివాసంలో సోదాలు జరిపిన పోలీసులు.. విలువైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు.

# పుంగోల్ తరహాలో అమరావతిలో టౌన్‌షిప్

**సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో లోకేశ్ భేటీ**



**అమరావతి,మే11 :** సింగపూర్‌లోని పుం గోల్ తరహాలో అమరావతిలో నిర్మిం చబో యే ఇంటిగ్రేటెడ్ టౌన్ షిప్.. దేశానికే మోడల్‌గా నిలుస్తుందని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. సింగపూర్ పర్యటనలో భాగంగా అక్కడి వాణిజ్య, పరిశ్ర మల మంత్రిత్వశాఖ జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ జేఐఎస్‌సీ మద్దతుతో అమరావతి ఎకనామిక్ రీజి యన్‌ను అత్యుత్తమంగా అభివృద్ధి చేయాలని తాము కోరుకుంటు న్నామని చెప్పారు. ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిలో ఆసక్తిగల భాగస్వాములను ఆహ్వానిస్తూ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. రాజధాని అమరావతికి ఇప్పుడు జాతీయ చట్టబద్ధత ఉందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సింగపూర్ ద్వారా ఆగ్నేయ ఆసియా, తూర్పు ఆసియాల మధ్య వాణిజ్యాన్ని సులభతరం చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని కోరారు. సింగపూర్ సన్‌టెక్ సిటీని అధ్యయనం చేస్తామని లోకేశ్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్, సింగపూర్ ప్రభుత్వాల మధ్య ఇప్పుడు పటిష్ఠ భాగస్వామ్యం ఏర్పడిందన్నారు. ఎంవోయూలోని అంశాల అమలుపై వర్కింగ్ గ్రూపుల ద్వారా ప్రతినెలా సంప్రదింపులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఏపీ ప్రభుత్వానికి చెందిన ఆరుగురు మంత్రులు ఇటీవల సింగపూర్‌లో వారంరోజులపాటు శిక్షణా తరగతులకు హాజరై పరిపాలనలో తమ అనుభవాలను పంచుకున్నారని గుర్తుచేశారు.

# మౌళిక వసతులపై ప్రత్యేక దృష్టి

ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులతో మంత్రి చర్చించారు. హ్యామ్ ప్రాజెక్ట్ టెండర్ పక్రియపై అధికారులను ఆరా తీశారు. దేశవ్యాప్తంగా ఎన్‌హెచ్ఏఐ, ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్న హ్యామ్ మోడల్ వివరాలు మంత్రికి వివరించారు అధికారులు. బిటుమెన్ ధర మెట్రిక్ టన్నుకు రూ.44 వేల నుంచి రూ.89 వేలకు పెరిగిందని తెలిపారు. బిటుమెన్ ధరల్లో దాదాపు వందశాతం పెరుగుదల నమోదైందని అధికారులు వివరించారు. జీఎస్టీ అదనపు భారం, ఇతర మెయింటెనెన్స్, పశ్చిమాసియ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ధరలు పెరగడానికి కూడా ఓ కారణమని అధికారులు పేర్కొన్నారు. గుజరాత్‌లో 66శాతం, మహారాష్ట్రలో 47శాతం ధరలు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ధరలు తక్కువగా ఉన్నాయని వెల్లడించారు. .4 నుంచి రూ.5 లక్షల కోట్లతో దేశంలో 374కు పైగా హ్యామ్ ప్రాజెక్టులు కొనసాగు తున్నాయని మంత్రి తెలిపారు.

# కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం

అధికారులు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి హాజరయ్యారు. శాస్త్రీయంగా కనీస వేతనాల సవరణ చేపడతామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇతర రాష్ట్రాల కనీస వేతన విధానాలపై సమీక్షిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్ ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించామని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు ఉండాలని కమిటీ సభ్యులు తెలిపారు. కేవలం అంకెల్లో కాదని.. వాస్తవ అవసరాలకు తగ్గట్టే వేతనాలు ఉండాలని చెప్పుకొచ్చారు. దేశంలో ఉత్తమ వేతన నమూనాలను తెలంగాణలో అమలు చేస్తామని భట్టి విక్రమార్క అన్నారు. కార్మికుల పక్షపాతి రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అసంఘటిత, సంఘటిత రంగ కార్మికులకు లాభం చేకూరేలా చర్యలు చేపడతామని అన్నారు. అన్నివర్గాల అభిప్రాయాలతో త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# గుప్తనిధుల కోసమే ఆలయం కూల్చివేత

అయితే అర్ధరాత్రి తవ్వకాలు ఎందుకు చేపట్టారని ప్రశ్నించారు. గర్భగుడి కింద 24 అడుగుల లోతు తవ్వాకాలు చేపట్టారని పురావస్తు శాఖ తేల్చింది. ఆలయాల కూల్చివేతపై ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుంత్వం రాగానే దేవాదాయ శాఖ భూమి ప్రభుత్వ భూమిగా మారిందన్నారు. గుప్త నిధుల వేటలో ప్రభుత్వ పెద్దలు ఉన్నారన్నారు. పేదల ఇళ్లతో పాటు గుళ్లను కూల్చివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో వరంగల్ జిల్లాలో ఎన్నో ఆలయాలను పునరుద్ధరించామని గుర్తు చేశారు. రామప్ప ఆలయానికి బీఆర్ఎస్ యునెస్కో గుర్తింపు తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ధ్వంసం చేసిన శివాలయాన్ని పునర్నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సూదర్శన్ రెడ్డి, దాస్యం వినయ భాస్కర్, అరూరి రమేష్, శంకర్ నాయక్ తదితరులు ఉన్నారు.

# ప్రధాని మా ఇంటికి రావడం గొప్ప విశేషం

- **మరచిపోలేని అనుభూతిని పొందాం**
- **ఎక్స్ వేదికగా చంద్రబాబు, లోకేశ్ భావోద్వేగం**

**అమరావతి,మే11:** హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తమ నివాసానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రావడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ భావోద్వేగంగా స్పందించారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పోస్టు చేస్తూ ప్రధాని పర్యటనను ప్రత్యేకమైన సందర్భంగా వారు అభివర్ణించారు. ప్రధాని మోదీకి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మీయ స్వాగతం పలకడం గొప్ప గౌరవంగా భావిస్తున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ మేరకు సీఎం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. తమ కుటుంబం ఎప్పటికీ మర్చిపోలేని, ఒక మధుర జ్ఞాపకంగా నిలిచిపోయే సాయంత్రం ఇదని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ రోజు తమ నివాసంలో ప్రధాని మోదీకి ఆతిథ్యం ఇవ్వడం తమకు లభించిన గొప్ప గౌరవం, సంతోషమని చెప్పుకొచ్చారు. ఆప్యాయత, అనురాగంతో ప్రధాని తమతో గడిపిన ఈ సందర్భం తమ అందరికీ ఎంతో ప్రత్యేకమని వ్యాఖ్యానించారు. తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్ర యాణంలోమోదీ అందిస్తున్న నిరంతర ప్రోత్సా హానికి, మద్దతుకు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు చెప్పారు. హైదరాబాద్‌లోని తమ ఇంటికి ప్రధాని మోదీని స్వాగతించడం గొప్ప విశేషమని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యా ఖ్యానించారు.మోదీ తమ కుటుంబానికి అందించిన ఆప్యాయత, ఆశీర్వాదాలకు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబంలోని మూడు తరాలు ప్రధానితో కలిసి ఉండటం ముఖ్యంగా గుర్తుండి పోయే మధుర జ్ఞాపకమని చెప్పుకొచ్చారు. మోదీ.. తన కుమా రుడు నారా దేవన్ష్‌ను ఆశీర్వది ంచడం నిజంగా గొప్ప అదృష్టమని తెలిపారు. ఎప్పటిలాగే, తాను దేశంపై ఆయన అచంచలమైన నిబద్ధతతో ప్రేరణ పొందానని అన్నారు. ప్రజల సేవలో మరింత కష్టపడి తాను పనిచేయడానికి మో దీ నుంచి స్ఫూర్తి పొందానని తెలిపారు. ఇలాంటి క్షణాలు జీవితాంతం ఎంతో గుర్తుండి పోతాయని పేర్కొన్నారు.

బలగం TV BALAGAM


# కాజా టోల్‌గేట్ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి




- చిన్న కాకాని వద్ద ఇంటర్ ఛేంజ్ లేక సమస్యలు
- పలు రోడ్ల నిర్మాణాలపై గడ్కరీకి పెమ్మసాని వినతి
- రామాయపట్నం పోర్టుకు లింక్ చేస్తూ కొత్త రైల్వే లైన్
- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరిన ఎంపి లావు

**న్యూఢిల్లీ,మే11 :** కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సోమవారం కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. గుంటూరు - విజయవాడ జాతీయ రహదారి సమన్వయం చేస్తూ కాజా టోల్‌గేట్ సమీపాన నిర్మించిన వెస్ట్ బైపాస్ వద్ద ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని కేంద్రమంత్రి గడ్కరీకి విజ్ఞప్తి చేశారు.విజయవాడ వెస్ట్ బైపాస్ ఎన్‌హెచ్ - 16తో కలిసే చిన్నకాకాని జంక్షన్ వద్ద ప్రస్తుతం గ్రేడ్ సెపరేటెడ్ ఇంటర్‌చేంజ్ లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని పెమ్మసాని వివరించారు. విజయవాడ వైపు వెళ్లే వాహనాలు హైల్యాండ్ ఫ్లై ఓవర్ కింద ఉన్న రెండు లైన్ల సర్వీస్ రోడ్, యూటర్న్ ద్వారా వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోవడం, లక్షలాది మంది ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఇదిలావుంటే రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో తెలుగుదేశం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. పల్నాడు అభివృద్ధికి సంబంధించి కీలక రైల్వే ప్రాజెక్టులపై మాట్లాడారు. పిడుగురాళ్ల - సావల్యపురం నుంచి రామాయపట్నం పోర్టుకు రైల్వేలైన్ నిర్మించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. రామాయపట్నం పోర్టు కనెక్టివిటీతో పల్నాడులో పారిశ్రామిక, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. నడికుడి లేదా పిడుగురాళ్ల స్టేషన్లలో సికింద్రాబాద్ - తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నిలపాలని విజ్ఞపి చేశారు. లింగంపల్లి -విజయవాడ ఎక్స్‌ప్రెస్ (12796) హాల్టింగ్ కోసం కేంద్రమంత్రికి ఎంపీ వినతిపత్రం అందజేశారు. విజయవాడ - బెంగళూరు మధ్య కొత్తగా వందేభారత్ రైలును ప్రారంభించాలని కోరారు. విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు, వ్యాపారుల సౌకర్యార్థం హైస్పీడ్ కనెక్టివిటీ అవసరమని తెలిపారు. పిడుగురాళ్ల జంక్షన్‌ను రామాయపట్నం పోర్టుకు లింక్ చేస్తూ.. కొత్త రైల్వే లైన్ తీసుకురావాలని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను తెదేపా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. సోమవారం కేంద్రమంత్రిని ఆయన కలిసి ఈ విజ్ఞప్తి చేశారు. ఓడరేవుకు రైలు మార్గాన్ని కలపడం ద్వారా.. పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పన పెరుగుతుందని వివరించారు. సిమెంట్, సున్నపురాయి, వ్యవసాయం, లాజిస్టిక్స్ రంగాలకు గణనీయంగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. సికింద్రాబాద్- తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి-విజయవాడ ఎక్స్‌ప్రెస్ వంటి ప్రీమియం, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు నడికుడి లేదా పిడుగురాళ్ల స్టేషన్లలో స్టాపులు ఇవ్వాలని కోరారు. పల్నాడు నుంచి వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, రోజువారీ ప్రయాణికులు ప్రస్తుతం ప్రధాన నగరాలకు వేగవంతమైన రైలు కనెక్టివిటీని పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఆంధ్రప్రదేశ్, బెంగళూరు మధ్య విద్యార్థులు, ఐటీ నిపుణులు, వ్యాపారవేత్తలు, కుటుంబాల రాకపోకలు పెరుగుతున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని.. విజయవాడ-బెంగళూరు మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడపాలని కేంద్రమంత్రిని ఎంపీ కోరారు. ప్రతిపాదిత ఈ సర్వీసు ప్రయాణ సమయాన్ని తగ్గించి, రెండు ప్రాంతాల మధ్య హై-స్పీడ్ రైలు కనెక్టివిటీని మెరుగుపరుస్తుందన్నారు. తన ప్రతిపాదనలకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. అభ్యర్థనలను పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు.ఎంపీ లావు ప్రతిపాదనలపై సానుకూలంగా రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ స్పందించారు. పల్నాడు ప్రాంత రైల్వే సమస్యల పరిష్కారానికి అశ్విని వైష్ణవ్ హామీ ఇచ్చారు.

# బెంగాల్ నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం



- సరిహద్దుల్లో కంచె ఏర్పాటుకు అంగీకారం
- ఉద్యోగుల పదవీవిరమణ వయసు పెంపు
- మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం

**కోల్‌కతా,మే 11 :** పశ్చిమ బెంగాల్‌లో ఏర్పాటైన నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్- బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం కోసం బీఎస్‌ఎఫ్‌కు భూమిని కేటాయిస్తూ తొలి మంత్రివర్గ సమావేశంలోనే నిర్ణయం తీసుకుంది. దీనిపై ముఖ్యమంత్రి సువేందు అధికారి మాట్లాడుతూ.. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే బంగ్లాదేశ్ వెంబడి ఉన్న సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి బీఎస్‌ఎఫ్‌కు భూమిని బదిలీ చేశామన్నారు. మరో 45రోజుల్లో ఈ పక్రియ పూర్తవుతుందన్నారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆయుష్మాన్ భారత్' పథకంతో పాటు ఇతర పథకాలనూ రాష్ట్రంలో అమలు చేయనున్నట్లు ప్రకటించారు.బెంగాల్లో తాము అమలు చేయనున్న అనేక సంక్షేమ పథకాలను సువేందు అధికారి నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం వెల్లడించింది. అందులో జూన్ 1నుంచి రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ల్పించనున్నట్లు ప్రకటించింది. దీనివల్ల ప్రజా రవాణాపై ఆధారపడే లక్షలాదిమంది మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు ప్రయోజనం పొందుతారని అధికారులు పేర్కొన్నారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. జూన్ 1నుంచి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం ప్రారంభమైనప్పటికీ.. రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న సామాజిక సంక్షేమ పథకాలూ కొనసాగుతాయని స్పష్టం చేశారు. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో హామీ ఇచ్చిన విధంగా ఇతర పథకాలనూ త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చినట్లుగా.. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపిందని సువేందు పేర్కొన్నారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జారీ చేసిన జూన్ 2025 జనగణన సర్క్యులర్‌ను గత ప్రభుత్వం విస్మరించిందని.. దానిని తక్షణమే అమలు చేసేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు.

# కులానికో రెసిడెన్షియల్ పాఠశాల


- వీటితో సమాజంలో పెరుగుతున్న కులవివక్ష
- కులవివక్ష రూపు మాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- విద్యారంగ అభివృద్ధి కోసమే విద్యాశాఖను పర్యవేక్షిస్తున్నా
- 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో విద్యా వారోత్సవాలు
- ఎల్బీ స్టేడియంలో ప్రారంభించిన సిఎం రేవంత్



**హైదరాబాద్, మే 11:** ఎస్సీ, ఎస్టీ, బీసీ అంటూ కులానికొక రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయడం వల్ల కుల వివక్ష పెరుగుతుందని మేం గ్రహించాం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కులవివక్షను రూపుమాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్‌ను నిర్మించే వేదికలుగా మారాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యా వ్యవస్థకు సంబంధించి రూ.1,100 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ప్రభుత్వం విద్యా వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఎల్బీ స్టేడియం లో ఏర్పాటు చేసిన వేదికపై ఈ వారోత్సవాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని ఈ శాఖను తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. విద్యావ్యవస్థలోనూ తెలంగాణ ప్రాంతం దశాబ్దాలుగా వివక్షకు గురైంది. వివక్ష వల్లే 1969లో తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. అప్పటి నుంచి కొన్ని దశాబ్దాల పాటు పోరాడి తెలంగాణ సాధించుకున్నాం. వర్సిటీలు నిర్లక్ష్యానికి గురైతే మన విద్యా వ్యవస్థ ప్రమాణాలు పడిపోతాయని గ్రహించాం. పేద బడుగు బలహీన వర్గాలకు సైతం నాణ్యమైన విద్యను అందించడం మా ప్రభుత్వం బాధ్యతగా భావిస్తుంది. మేం అధికారంలోకి రాగానే 11వేల టీచర్ పోస్టులను భర్తీ చేశాం. 60 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలు అందించాం. వివాదాలకు తావులేకుండా 36వేల మంది టీచర్లను బదిలీ చేశాం అని వివరించారు. రాష్ట్రంలోని 27వేల పాఠశాలల్లో 19లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రంలో విద్యార్థి, టీచర్ నిష్పత్తి 17:1గా ఉంది. ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను మనం అధిగమించాలి. ఫలితాల్లో ప్రైవేటుతో పోలిస్తే ఎందుకు వెనకబడి ఉన్నామో ఆలోచించాలి. కమిషన్ సిఫార్సుల ప్రకారం విద్యాశాఖకు నిధులు 15 శాతానికి పెంచుతాం. విదేశాల్లో విద్యా విధానంపై అధ్యయనం చేయాలని 25 మంది టీచర్లను ఫిన్‌లాండ్‌కు పంపించాం. అవసరమైతే మరిన్ని దేశాలకు పంపించి.. ఉత్తమ విద్యా విధానాలను తెలంగాణలో అమలు చేస్తాం అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకాహారం పెట్టనున్నాం. మధ్యాహ్న భోజనంతోపాటు బ్రేక్‌ఫాస్ట్ పథకం పెట్టాలని నిర్ణయించాం. ఈ పథకాన్ని కొన్ని పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాం. విద్యారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయి. మనం మాత్రం ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే కొనసాగిస్తున్నాం. టెన్ ప్లస్ టూ విధానం లేకపోవడం వల్లే పది తర్వాత డ్రాప్ అవుట్లు పెరుగుతున్నాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును మార్చే దిశగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా రూ. 1,011 కోట్లతో క్యూర్ ప్రాంతంలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. విద్యాశాఖ స్టాల్స్ ను సందర్శించిన సీఎం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులకు దిశానిర్దేశర చేశారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. 'తెలంగాణ సమాజం బలోపేతం కావాలంటే విద్య, వైద్యం అందరికీ సమానంగా అందాలి. అందుకే విద్యాశాఖను వేరే ఎవరికీ ఇవ్వకుండా నేనే నా దగ్గర పెట్టుకున్నాను. సమీక్షల సమయంలో నన్ను సీఎంగా కాకుండా విద్యాశాఖ మంత్రిగా చూడండి. తండాలు, గూడాలు, మారుమూల గ్రామాల్లోని పేద బిడ్డలకు అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం' అని ఆయన స్పష్టం చేశారు. అవుటర్ రింగ్ లోపల ఉన్న విద్యా సంస్థల అభివృద్ధి కోసం రూ. 1,700 కోట్లతో ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ విద్యపై తమకున్న చిత్తశుద్ధిని చాటుతూ, కేవలం 60 రోజుల్లోనే 11,000 ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశామని సీఎం గుర్తు చేశారు. దాదాపు 22 వేల మంది టీచర్లకు పదోన్నతులు కల్పించడంతో పాటు, ఎంతో క్లిష్టమైన 36 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలను ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామన్నారు.ఈ విజయాలను నీతి ఆయోగ్ సైతం అభినందించిందని ఆయన గర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలో 12 వేల ప్రైవేట్ స్కూళ్లలో 38 లక్షల మంది ఉంటే, 27 వేల ప్రభుత్వ స్కూళ్లలో 19 లక్షల మంది చదువుకుంటున్నారు. ప్రైవేట్ స్కూళ్లలో ఉన్న గొప్పతనం ఏమి టి? ప్రభుత్వ స్కూళ్లలో లోపం ఏమిటి? అని ప్రశ్నించుకోవాలి. అందుకే మేము ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను ప్రవేశపెడుతున్నాం' అని ముఖ్యమంత్రి ప్రకటించారు. బ్జడెట్‌లో విద్యకు కేటాయించిన 8 శాతం నిధులను క్రమంగా 15 శాతానికి పెంచుతామన్నారు. 100 నియోజకవర్గాల్లో రూ. 20 వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తామని, ఇక్కడ చదువుకున్న పేద బిడ్డ లు గర్వంగా తమ పాఠశాల పేరు చెప్పుకోవాలని ఆకాంక్షి ంచారు. విద్యార్థుల సంక్షేమం కోసం కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం, డైట్ ఛార్జీలను 40 శాతం పెంచినట్లు సీఎం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పాలు, రాగిజావతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తామని, కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్టుగా బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని చెప్పారు. అలాగే రూ. 1,000 కోట్లతో ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని, ఈ వస్తువుల నాణ్యతను తానే స్వయంగా పరిశీలించానని పేర్కొన్నారు. 'విద్యా ర్థులకు నాణ్యత లేని వస్తువులను సరఫరా చేసే కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టడమే కాదు.. వారిని బొక్కలో తోయించే బాధ్యత నాది అని ముఖ్యమంత్రి హెచ్చరిం చారు. ఉపాధ్యాయులపై నమ్మకం ఉంచుతూ, వారికి ఒకటో తారీఖునే జీతాలు అందజేస్తున్నామని సీఎం చెప్పారు. 'టీచర్లకు ఇది కేవలంఉద్యోగంకాదు..అదొకబాధ్యత. 19 లక్షల మం ది విద్యార్థుల భవిష్యత్తు మీ చేతుల్లో ఉంది. పేద తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూడాలంటే టీచర్లు ఒక గంట అదనంగా పనిచేయాలి' అని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలు అనాథ శరణాలయాలుకావని, అవి అభివృద్ధి వేదికలని చాటిచెప్పేలా కఠిన నిర్ణయాలు తీసుకుంటామని రేవంత్ రెడ్డి తెలిపారు.

# రాష్ట్రానికి వచ్చి సుద్దులు చెప్పిన ప్రధాని


- అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా మాటలెందుకు
- ప్రధాని పర్యటనపై మంత్రి పొన్నం వ్యాఖ్యలు




**హైదరాబాద్,మే 11 :** ప్రధానమంత్రి మోదీ తెలంగాణకు వచ్చి అభివృద్ధికి నిధులేమీ ఇవ్వకుండా పెట్రోల్, బంగారం, వంట నూనె వాడవద్దని చెప్పి వెళ్లారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. తెలంగాణకు ప్రధాని వస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని ప్రజలు ఆశించారని, కానీ అభివృద్ధికి నిధులేమీ ప్రకటించకుండా పెట్రోల్, డీజిల్ వాడవద్దు.. బంగారం కొనవద్దు.. వంట నూనె వాడవద్దు అని చెప్పడం ప్రధాని హోదాకు తగదని అన్నారు. సోమవారం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. వేలాది కార్లతో రోడ్ షో చేసిన మోదీ ప్రజలకు భరోసా ఇవ్వాల్సింది పోయి భయాందోళనలు కలిగించారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ దర్యాప్తు చేయాలని భాజపా నేతలు గతంలో డిమాండ్ చేశారని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించినా కేంద్రం ఎందుకు చేయడం లేదని మంత్రి ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన 12 ఏళ్లలో కేంద్రం ఏం చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. ఆర్ఆర్ఆర్ నిధులు, మెట్రో నిధులు, రేడియల్ రోడ్లు, గోదావరి పుష్కరాలకు ప్రత్యేక నిధులు సహా రాష్ట్రానికి కావాల్సిన అభివృద్ధి అంశాలపై తెలంగాణలోని 8 మంది భాజపా ఎంపీలు.. ఒక్క వినతిపత్రమైనా ఇచ్చారా? అని మంత్రి నిలదీశారు. బీసీ హక్కులు, దేవాలయాల అభివృద్ధి, క్యూర్ ఏరియా అభివృద్ధి వంటి కీలక అంశాలపై తెలంగాణ భాజపా నేతలు మాట్లాడటం లేదని మంత్రి విమర్శించారు. రాహుల్ గాంధీ సూచనలతో తెలంగాణలో కులగణన నిర్వహించామని, జనగణనలో బీసీ కులాల వివరాలు చేర్చాలని కేంద్రాన్ని కోరినా మోదీ సర్కార్ స్పందించడం లేదని మంత్రి పొన్నం ఆరోపించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ నెరవేర్చలేదని విమర్శించారు. బండి సంజయ్ కుమారుడిపై వచ్చిన ఆరోపణల విషయంలో కేంద్ర మంత్రి హోదా ఉపయోగించి విచారణ అడ్డుకోవద్దన్నారు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలని, దోషులకు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

# అల్పపీడన ప్రభావంతో పలు జిల్లాల్లో వర్షాలకు ఛాన్స్

- పిడుగులతో వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ



**అమరావతి,మే 11 :** అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో కీలక హెచ్చరికలు జారీ చేశారు. ఉత్తర శ్రీలంక తీరానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం ప్రభావంతో రానున్న 48 గంటల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు, రైతులు, పశుకాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విపత్తు నిర్వహణ శాఖ ప్రకారం ప్రస్తుతం నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం మరింత బలపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో మంగళవారం శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా తీరప్రాంత జిల్లాలతో పాటు రాయలసీమలో కూడా వాతావరణ మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. పిడుగుల సమయంలో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ఉండొద్దని హెచ్చరించారు. ఉరుముల శబ్దాలు వినిపించిన వెంటనే సురక్షిత భవనాల్లో ఆశ్రయం పొందాలని సూచించింది. అలాగే పాత భవనాలు, భారీ హోర్డింగ్స్ సమీపంలో నిలబడకూడదని అధికారులు హెచ్చరించారు. చెట్ల కింద ఆశ్రయం పొందడం ప్రమాదకరమని స్పష్టం చేశారు. రైతులు, వ్యవసాయ కూలీలు పొలాల్లో పనిచేస్తున్న సమయంలో ఉరుముల శబ్దాలు వినిపిస్తే వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.వర్ష సూచనలతో పాటు కొన్ని ప్రాంతాల్లో తీవ్ర ఉష్ణోగ్రతలు కూడా నమోదవుతు న్నాయని వెల్లడించారు. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లా, పోలవరం ప్రాంతాల్లో వడగాలులు హెచ్చరిక జారీ చేశారు. జికె వీధి, ముంచింగిపుట్టు, పెదబయలు, చింతూరు, కూనవరం మండలాల్లో హీట్ అలర్ట్ అమల్లో ఉందని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. విజయవాడ తూర్పులో అత్యధికంగా 42.3÷బిఅ నమోదు, కుక్కునూరు, కూనవరం ల 42.1÷బిఅ, మంత్రాలయంలో 41.5÷బిఅ, కొప్పెరపాడులో 41.4÷బిఅ, కడపలో 41.3÷బిఅ, తాడేపల్లిలో 41.2÷బిఅ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ పరిస్థితుల్లో మధ్యాహ్న సమయంలో ప్రజలు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడగాలులు, పిడుగుల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. పశువులను చెట్ల కింద కట్టేయకుండా సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలని సూచించారు. వ్యవసాయ పనులను ఉదయం లేదా సాయంత్రం సమయంలో చేసుకోవడం మంచిదని పేర్కొన్నారు. తగినంత నీరు తాగడం, ఎండలో ఎక్కువసేపు పనిచేయకుండా ఉండడం అవసరమని తెలిపారు.

# ప్రతి ఒక్కరికీ కార్పొరేట్ స్థాయి విద్యే ప్రభుత్వ లక్ష్యం..

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ:**



సమాజంలోని ప్రతి విద్యార్థికి, ముఖ్యంగా పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం వేములవాడ పట్టణంలోని పీఎం శ్రీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యా వారోత్సవాలను,పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారా విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తును అందించవచ్చని అన్నారు . ఇందులో భాగంగానే ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మోడల్ పాఠశాలల నిర్మాణం చేపడుతున్నమని,ఈ పాఠశాలల్లో నర్సరీ నుండి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో విద్యను అందిస్తారని, పూర్తిస్థాయి ఆంగ్ల మాధ్యమ బోధన ఉండటం వల్ల ఇవి కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా నిలుస్తాయని అన్నారు . అంతర్జాతీయ స్థాయి పాఠశాలల తరహాలో ఆధునిక డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, స్మార్ట్ ల్యాబ్స్ మరియు మెరుగైన మౌలిక వసతులతో ఈ క్యాంపస్‌లను అభివృద్ధి చేస్తున్నమని అన్నారు .

కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడలు, వ్యక్తిత్వ వికాసం, టెక్నాలజీ ఆధారిత అభ్యాసంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు . విద్యా వారోత్సవాల ద్వారా ప్రభుత్వం చేపట్టిన ఇలాంటి వినూత్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్నామని చెప్పారు. నేటి నుండి మే 25 వరకు కొనసాగే ఈ వేసవి శిబిరాల్లో విద్యార్థులకు కోడింగ్, కళలు, క్రీడలు, యోగా మరియు వ్యక్తిత్వ వికాసం వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారని, విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పశువుల అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన నిఘా.

**-జిల్లా పరిధిలో మూడు చెక్ పోస్టులు ఏర్పాటు..**

**-ఎస్పీ మహేష్ బి.గితే.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

బక్రీద్ సందర్భంగా జిల్లాలో పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ఎస్పీ మహేష్ బి .గితే సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు..ఈసందర్భంగా ఎస్పీ మహేష్ బి .గితే మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లా వ్యాప్తంగా మూడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

జిల్లా పరిధిలో తంగళ్ళపల్లి మండలం జిల్లెళ్ల , గంభీరావుపేట మండలం పెద్దమ్మ చౌరస్తా,రుద్రంగి మండలం మానాల క్రాస్ రోడ్ వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటుగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ అనుమానాస్పద వాహనాలపై నిఘా ఉంచుతున్నామన్నారు.పశువులను అక్రమంగా రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, ఇది మూగజీవాల పట్ల క్రూరత్వానికి దారితీస్తుందన్నారు.ప్రభుత్వం మరియు సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పశువుల రవాణాకు సంబంధించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని,నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుదని తెలిపారు.

**గోరక్షణ పేరుతో చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకోవద్దు...**

గోరక్షణ పేరుతో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని దాడులు చేయడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడడం చట్టరీత్యా నేరమని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎవరైనా పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని,అక్రమంగా పశువులను తరలించే వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉండదనిఅన్నారు .

**సోషల్ మీడియా పై ప్రత్యేక నిఘా..**

సోషల్ మీడియా వేదికగా మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు.సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, నిజానిజాలు నిర్ధారించకుండా అసత్య ప్రచారాలు గ్రూప్ లలో ఫార్వర్డ్ చేసిన పోస్ట్ చేసిన వారితో పాటుగా గ్రూప్ అడ్మిన్ లపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.



# ప్రజావాణి అర్జీలకు పరిష్కారం చూపాలి

**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

ప్రజావాణి అర్జీలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్బంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజావాణి ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 165 దరఖాస్తులు రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల నైపుణ్యాలకు సానబెట్టేందుకే సమ్మర్ క్యాంపులు..

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**




నిత్యం పుస్తక పఠనం, పరీక్షల ఒత్తిడిలో ఉండే విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీసేందుకు సమ్మర్ క్యాంపులు ఎంతగానో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు . రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ'లో భాగంగా సోమవారం సిరిసిల్ల పట్టణం గీతానగర్‌లోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా వారోత్సవాలను, సమ్మర్ క్యాంపును కలెక్టర్ గరిమ అగ్రవాల్ జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, విద్యా వ్యవస్థలో ప్రభుత్వం తీసుకువచ్చిన విప్లవాత్మక సంస్కరణలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకే ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేటి నుండి ఈ నెల 17వ తేదీ వరకు వారం రోజుల పాటు జిల్లావ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు ఉంటాయని అన్నారు . తొలిరోజు మౌలిక వసతుల పనుల ప్రారంభంతో పాటు సమ్మర్ క్యాంపులు మొదలయ్యాయని, రెండో రోజు పదో తరగతి విద్యార్థులకు రెమిడియల్ తరగతులు, మూడో రోజు సర్పంచ్‌లతో వర్క్‌షాప్, నాలుగో రోజు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట, ఐదో రోజు గ్రంథాలయాల్లో పుస్తక పఠనం, ఆరో రోజు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, చివరి రోజున 'విద్యా విజయోత్సవ దినోత్సవం' నిర్వహిస్తామని అన్నారు .

సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు ఉదయం 8 నుండి 12 గంటల వరకు సంగీతం, నాట్యం, చిత్రలేఖనం, చేతిరాతతో పాటు ఆత్మరక్షణ విద్యలైన కర్రసాము వంటి అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారని, ఏ పాఠశాల విద్యార్థులైనా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు నేడు కార్పొరేట్ సంస్థలకు దీటుగా తయారయ్యాయని, గీతానగర్ పాఠశాలలో ప్రవేశాల కోసం ఉన్న డిమాండే ఇందుకు నిదర్శనమని అన్నారు.చదువుతో పాటు నూతన ఆవిష్కరణలపై ఆసక్తి చూపే విద్యార్థులను ఇస్రో సందర్శనకు పంపిస్తామని అన్నారు. అనంతరం, పదో తరగతి ఫలితాల్లో 589 మార్కులు సాధించి జిల్లా స్థాయిలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అంకాలపు సిరిని కలెక్టర్ ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. సమ్మర్ క్యాంపులో పాల్గొంటున్న విద్యార్థులకు లెర్నింగ్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెలుముల స్వరూప, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్, మండల విద్యాధికారి రఘుపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, తదితరులు పాల్గొన్నారు.

# జనగణన విధులకు ప్రజలు సహకరించాలి..



**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

జనగణన 2027 మొదటి దశ ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో వివరాల సేకరణకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలందరూ పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ మరియు ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ అన్నారు . సోమవారం సిరిసిల్ల పట్టణంలోని సుభాష్ నగర్‌లో ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న ఇండ్ల గణన మ్యాపింగ్ ప్రక్రియను కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు జనగణన అత్యంత కీలకమైనదని, ప్రజలు తమ సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.

?నేటి నుండి మూడు రోజుల పాటు జిల్లావ్యాప్తంగా బ్లాక్ వారీగా ఇండ్ల మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, ఆ తర్వాత ప్రతి ఇంటికి సిబ్బంది వచ్చి వివరాలు సేకరిస్తారని అన్నారు.ఈ బృహత్తర కార్యక్రమం కోసం జిల్లాలో 173 మంది సూపర్‌వైజర్లు, 1025 మంది ఎన్యూమరేటర్లకు ఇప్పటికే ప్రత్యేక శిక్షణ ఇచ్చామని తెలిపారు. గుర్తింపు విషయంలో ప్రజలకు ఎలాంటి అనుమానాలు కలగకుండా ఉండేందుకు ఎన్యూమరేటర్లకు ఫోటో మరియు క్యూ ఆర్ కోడ్ తో కూడిన గుర్తింపు కార్డులను అందజేశామని, వాటిని స్కాన్ చేయడం ద్వారా అధికారిక వెబ్‌సైట్‌లో వారి వివరాలను సరిచూసుకోవచ్చని సూచించారు.

?ఎన్యూమరేటర్లు అడిగే 33 రకాల ప్రశ్నలకు ప్రజలు ఓపికతో సరైన సమాధానాలు చెప్పాలని అన్నారు.. అలాగే, జనగణన పేరుతో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి మోసాలకు పాల్పడే అవకాశం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండి కేవలం గుర్తింపు కార్డు కలిగిన అధికారిక సిబ్బందికి మాత్రమే వివరాలు వెల్లడించాలని స్పష్టం చేశారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున క్షేత్రస్థాయిలో పర్యటించే సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.పరిశీలనలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస చారి, మున్సిపల్ కమీషనర్ ఖదీర్ పాషా, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్, తదితరులు ఉన్నారు.



# అధ్యాత్మిక శిఖరాగ్రాన సిరిసిల్ల బిడ్డ..

**700 శ్లోకాలు కంఠస్థం చేసి స్వర్ణ పతకం సాధించిన స్రవంతి..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన దొంతుల స్రవంతి ఆధ్యాత్మిక రంగంలో అద్భుత ప్రతిభను చాటి వార్తల్లో నిలిచారు. మైసూర్ అవధూత దత్త పీఠాధిపతి పరమపూజ్య శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ నిర్వహించిన గీతా మహాయజ్ఞంలో తన మేధాశక్తిని ప్రదర్శించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు.

?భగవద్గీతలోని 18 అధ్యాయాలలో గల మొత్తం 700 శ్లోకాలను అత్యంత స్పష్టంగా, ధారాళంగా కంఠస్థం చేసినందుకు గాను దొంతుల స్రవంతి ఈ ప్రతిష్టాత్మక పురస్కారం వరించింది. మైసూర్‌లోని దత్త పీఠంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా ఈ స్వర్ణ పతకాన్ని అందుకున్నారు. కఠినమైన పరీక్షా ప్రక్రియను అధిగమించి, శ్లోకాలను ఉచ్చారణ దోషాలు లేకుండా పఠించి స్రవంతి అందరినీ ఆశ్చర్యపరిచారు.?నేటి ఆధునిక కాలంలో యువత ఆధ్యాత్మిక సంపదకు దూరమవుతున్న తరుణంలో, స్రవంతి కనబరిచిన ఈ పట్టుదల మరియు శ్రద్ధ ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. సిరిసిల్ల మట్టిలోని ప్రతిభను ఆధ్యాత్మిక వేదికపై చాటిన స్రవంతిని పలువురు అభినందనలతో ముంచెత్తుతున్నారు.




# బాలికపై అఘాయిత్యం జరిగితే బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడరు..?

**-కేంద్ర మంత్రి పదవి నుండి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి..**

**-డిసిసి ప్రెసిడెంట్ సంగీతం శ్రీనివాస్.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

దేశం, ధర్మం అంటూ ప్రగల్భాలు పలికే భారతీయ జనతా పార్టీ నాయకులు, హిందూ మైనర్ బాలికపై జరిగిన అత్యాచార ఘటనపై ఎందుకు నోరు మెదపడం లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ప్రశ్నించారు . సోమవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిసిసి ప్రెసిడెంట్ సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి కుమారుడు ఒక హిందూ మైనర్ బాలికపై అఘాయిత్యానికి ఒడిగడితే, హిందూ ధర్మం గురించి మాట్లాడే నాయకుల నోర్లు ఎందుకు మూతపడ్డాయని అన్నారు . ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ బండి సంజయ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుండి తక్షణమే బర్తరఫ్ చేయాలని, బండి సంజయ్ ఎంపీ పదవికి కూడా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

?బాధిత హిందూ బాలికకు న్యాయం చేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పైగా బాధితులను బెదిరింపులకు గురిచేయడం దుర్మార్గమని అన్నారు . ఈ వ్యవహారంలో నిజనిర్ధారణ జరగాలంటే బండి సంజయ్ పదవిలో కొనసాగకూడదని అన్నారు . రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఘటనపై తక్షణమే స్పందించి, ప్రత్యేక అధికారిని నియమించి నిష్పక్షపాతంగా విచారణ జరపాలని పోలీసులను ఆదేశించారని అన్నారు . దోషులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనకాడబోదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజుతో పాటు నాయకులు కూరపాటి శ్రీశైలం, లింగాల భూపతి, గోలి వెంకటరమణ, గాజుల సాగర్, గురు బాబు, బాల్ రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో సిరిసిల్ల క్రీడాకారుల జైత్రయాత్ర..

**- ఏకంగా 29 పతకాలు కైవసం..**

**జాతీయ స్థాయికి 12 మంది ఎంపిక**

**-క్రీడాకారులను అభినందించిన అసోసియేషన్ సెక్రటరీ ఒడ్నాల శ్రీనివాస్**

**బలగం టీవి, రాజన్న సిరిసిల్ల:**



రంగారెడ్డి జిల్లా కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియం వేదికగా ఈనెల 9, 10 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. రంగారెడ్డి జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి మాస్టర్ ఒడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో 13 మంది కిక్ బాక్సర్లు పాల్గొన్నారు. వివిధ వయస్సు విభాగాలలో అత్యంత పట్టుదలతో పోరాడిన జిల్లా క్రీడాకారులు ఏకంగా 29 పతకాలను గెలుచుకోవడమే కాకుండా, వారిలో 12 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై జిల్లా కీర్తిని రాష్ట్రవ్యాప్తంగా చాటారు. ఈ విజయవంతమైన జట్టుకు ఎనగందుల శ్రీనివాస్ కోచ్‌గా వ్యవహరించి క్రీడాకారులకు దిశానిర్దేశం చేశారు.

**వివిధ విభాగాలలో స్వర్ణ పతకాల జోరు**

ఈ పోటీలలో బాలికల చిల్డ్రన్ మ్యూజికల్ ఫామ్ హార్డ్ స్టైల్ వెపన్ విభాగంలో గజ్జల హిరణ్మయి తన అద్భుత ప్రదర్శనతో బంగారు పతకాన్ని కైవసం చేసుకోగా, బాలుర విభాగంలో శివాన్ను యాదవ్ తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. ఓల్డర్ కేడేట్ హార్డ్ స్టైల్ వెపన్ విభాగంలో గజ్జల శ్వేదిక బంగారు పతకాన్ని సాధించగా, క్రియేటివ్ ఫామ్ వెపన్ విభాగంలో కర్నె యుతిక బంగారు పతకం మరియు లింగం శ్లోక వెండి పతకాలను సాధించి మెరిశారు. బాలుర విభాగంలో శ్రీరామ్ పట్ల సాయి సాత్విక్ మరియు గజ్జెల రిషిత్ తమ విభాగాలలో బంగారు పతకాలను సాధించగా, కోడం చైతన్య వెండి పతకాన్ని సొంతం చేసుకున్నారు. జూనియర్ బాలికల విభాగంలో అన్నదాసు లక్ష్మీ ప్రసన్న బంగారు పతకం సాధించగా, బాలుర విభాగంలో చోడిబోయిన లోకేష్ మరియు ఎర్నాల రాజశేఖర్ లు కూడా స్వర్ణ పతకాలను సాధించి జిల్లా పతకాల సంఖ్యను పెంచారు.

**పాయింట్ ఫైట్ మరియు కిక్ లైట్ విభాగాల్లో ప్రతిభ**

ఫైట్ విభాగాలలో కూడా జిల్లా క్రీడాకారులు తమ సత్తా చాటారు. జూనియర్ బాలుర 57 మరియు 69 కిలోల విభాగాలలో ఎర్నాల రాజశేఖర్, చోడిబోయిన లోకేష్ లు బంగారు పతకాలు సాధించగా, ఓల్డర్ కేడేట్ కిక్ లైట్ 47 కిలోల విభాగంలో గౌతమ్ ఆనంద్ వెండి పతకాన్ని కైవసం చేసుకున్నారు. 52 కిలోల విభాగంలో సాయి సాత్విక్ కాంస్య పతకం సాధించగా, బాలికల పాయింట్ ఫైట్ విభాగంలో గజ్జెల శ్వేదిక వెండి పతకాన్ని గెలుచుకున్నారు. లింగం శ్లోక, కర్నె యుతిక మరియు అన్నదాసు లక్ష్మీ ప్రసన్నలు కూడా తమ విభాగాలలో కాంస్య పతకాలను సాధించి జిల్లా విజయ పరంపరలో భాగస్వాములయ్యారు. చిల్డ్రన్ బాలుర 21 కిలోల విభాగంలో శివాన్స్ యాదవ్ కాంస్య పతకం సాధించారని సెక్రటరీ ఒడ్నాల శ్రీనివాస్ తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను, కోచ్ ఎనగందుల శ్రీనివాస్‌ను అభినందిచారు ,

# జనగణన కార్యకలాపాలకు కంప్యూటర్, ప్రింటర్ల అందజేత.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

జనగణన -- 2027 భాగంగా కార్యకలాపాలను అంతరాయం కలగకుండా నిర్వహించేందుకు జనగణన ఛార్జ్ అధికారులకు కంప్యూటర్, ప్రింటర్లను జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు జిల్లాలోని మండలాల ఛార్జ్ అధికారులకు అందజేశామని తెలిపారు. జనగణన ప్రక్రియను సమగ్రంగా, ఖచ్చితంగా నిర్వహించేందుకు, సమాచార సేకరణ, నివేదికల తయారీ వేగవంతంగా చేసేందుకు కంప్యూటర్లు, ప్రింటర్లు ఉపయోగపడతాయని అన్నారు. అధికారులకు అందజేసిన పరికరాలను సమర్థవంతంగా వినియోగించి, క్షేత్ర స్థాయిలో సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస చారి, ఎస్ ఓ సంపత్, ఛార్జ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే..

**- ఎస్పీ మహేష్ బి.గితే.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు.సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం లోని జిల్లా పోలీస్ పోలీస్ కార్యాలయంలో

గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించగా,ఎస్పీ మహేష్ బి.గితే జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 21 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని అన్నారు.పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.



## మతసామరస్యాన్ని కాపాడేలా పండుగల నిర్వహణ చేపట్టాలి

**- డీఎస్పీ నాగేంద్రచారి.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

మతసామరస్యాన్ని కాపాడుతూ, ఇతరుల మనోభావాలకు కించపరచకుండా పండుగల నిర్వహణ చేపట్టాలని డిఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్లో హిందూ సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు సహకరించాలని,అపోహలు, వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని సూచించారు.పశువుల అక్రమ రవాణాకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్న పోలీసు శాఖకు తెలియజేయాలని తెలిపారు. సొంతంగా వాహనాలను ఆపడం తనిఖీలు చేయడం లాంటివి వద్దని తెలిపారు.సోషల్ మీడియా పోస్టులు చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే డయల్ 100 ద్వారా లేదా పోలీసు అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, హిందూ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## స్తంభంపల్లి గంజి వాగు వంతెన పనులను వెంటనే పూర్తి చేయాలి

**ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన బిఆర్ఎస్ నేత కరుణాకర్**

**బలగం టీవి, బోయినిపల్లి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం స్తంభంపల్లి గ్రామ పరిధిలోని గంజి వాగు వద్ద నిలిచిపోయిన హై లెవెల్ వంతెన నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అక్కెనపల్లి కరుణాకర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన గ్రామస్తులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నేత కరుణాకర్ మాట్లాడుతూ గంజి వాగుపై వంతెన నిర్మాణ పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేసి దాదాపు ఐదు నెలలు గడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.జూన్ నెలలో వర్షాలు ప్రారంభమైతే వాగు ఉధృతి పెరిగి రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయే ప్రమాదం ఉందని అన్నారు.. ఈ వంతెన పనులు అసంపూర్తిగా ఉండటం వల్ల చొప్పదండి మరియు వేములవాడ నియోజకవర్గాల పరిధిలోని ప్రజలకు రవాణా సౌకర్యం కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, అత్యవసర వైద్యం కోసం వెళ్లే గర్భిణీలు, వృద్ధులు, రోగులతో పాటు రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

**అధికారులు చొరవ చూపాలని విజ్ఞప్తి**

వర్షాలు భారీగా కురిసిన సమయంలో వాగు ప్రవాహం కారణంగా వారం పది రోజుల పాటు ప్రజలు గ్రామాల్లోనే బందీలుగా ఉండిపోవాల్సి వస్తుందని అన్నారు . కావున జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని, నిలిచిపోయిన పనులను వెంటనే ప్రారంభించి రెండు నియోజకవర్గాల ప్రజల కష్టాలను తీర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ అక్కనపల్లి మధుకర్, న్యాయవాది అక్కనపల్లి అజయ్ కుమార్, ఎర్ర లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## బండి సంజయ్ కుమార్ కుటుంబంపై ఆరోపణలు పూర్తిగా రాజకీయ కక్షసాధింపులే

- **బిజెపి మండల అధ్యక్షులు పర్శరామ్**

**బలగం టీవి, బోయినిపల్లి;**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ కుటుంబంపై, ముఖ్యంగా వారి కుమారుడిపై కొందరు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ కక్షసాధింపులో భాగమేనని బిజెపి మండల అధ్యక్షులు పర్శరామ్ పేర్కొన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కేంద్రంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో పర్శరామ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు మరియు కేటీఆర్ అనుచర వర్గాలు కావాలనే అసత్య ప్రచారాన్ని కొనసాగించడం దురదృష్టకరమని అన్నారు . ప్రజల్లో గందరగోళం సృష్టించి, రాజకీయ లబ్ధి పొందాలని చేసే ప్రయత్నాలను ఖండిస్తున్నామని అన్నారు . తెలిసి తెలియక అవగాహన లేకుండా కొంతమంది బీఆర్ఎస్ నాయకులు సమాజానికి తప్పుడు సమాచారాన్ని చేరవేస్తూ, తమ వక్రబుద్ధిని బయటపెట్టుకుంటున్నారని,నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలు, కుటుంబాల పరువు ప్రతిష్టలను బజారుకి లాగడం వంటి చౌకబారు రాజకీయాలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడలేని బీఆర్ఎస్ నాయకులు, వ్యక్తిగత దూషణలు మరియు కుటుంబాలపై అసత్య ప్రచారాలతో రాజకీయాలు చేయడం మానుకోవాలని,హిందూ సమాజం కోసం నిరంతరం పోరాడుతున్న బండి సంజయ్ కుమార్ ప్రజాదరణను చూసి ఓర్వలేక ఇలాంటి కుట్రపూరిత ప్రచారాలు చేస్తున్నారని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కక్షపూరిత రాజకీయాలను వెంటనే ఆపాలని, కుటుంబాల గౌరవాన్ని దెబ్బతీసే తప్పుడు ప్రచారాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, బీఆర్ఎస్ నాయకుల ద్వంద్వ వైఖరి, వారి అసలు రాజకీయ సంస్కృతి, ప్రజలకు తెలిసేలా బీజేపీ చట్టబద్ధంగా మరియు ప్రజాస్వామ్య పద్ధతుల్లో బలమైన పోరాటం చేస్తుందని అన్నారు .

# సనత్‌నగర్ టిమ్స్‌లో పూర్తిస్థాయి వైద్యసేవలు

**- అధికారులతో సమీక్షలో మంత్రి దామోదర ఆదేశం**

**బలగం టీవి, హైదరాబాద్**



పేషెంట్లకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేలా సనత్‌నగర్ టిమ్స్‌ను తీర్చిదిద్దాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. సనత్‌నగర్ టిమ్స్‌లో జరుగుతున్న వైద్య సేవల ట్రయల్ రన్‌పై మంత్రి సోమవారం రివ్యూ చేశారు. సెక్రటేరియట్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, జాయింట్ సెక్రటరీ అయేషా, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రయల్ రన్‌లో భాగంగా అందిస్తున్న వైద్య సేవల వివరాలను, ఎదురవుతున్న ఇబ్బందులు, లోపాలను అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా.. ఓపీ రిజిస్ట్రేషన్, కన్సల్టేషన్ రూమ్‌లు, వెయిటింగ్ ఏరియా, డయాగ్నస్టిక్స్, రేడియాలజీ డిపార్ట్‌మెంట్, ఇన్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్లు, వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూల పనితీరుపై మంత్రి ఆరా తీశారు. ట్రయల్ రన్‌లో భాగంగా 22 డిపార్ట్‌మెంట్లలో ఓపీ సేవలు అందిస్తున్నామని అధికారులు తెలిపారు. ఆపరేషన్ థియేటర్లు శస్త్రచికిత్సలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రోగ నిర్ధారణ కోసం అత్యాధునిక సీటీ స్కాన్ , ఎంఆర్ఐ , డిజిటల్ ఎక్స్‌-రే మిషన్ల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. డయాగ్నస్టిక్స్ యంత్రాలు ఇన్‌స్టాలేషన్ పూర్తి అయిందని తెలిపారు. ట్రయల్ రన్‌లో భాగంగా టెస్టులు నిర్వహిస్తున్నామని చెప్పారు. సనత్‌నగర్ టిమ్స్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ కార్డియాక్ కేర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఆర్గాన్ ట్రాన్స్‌ఎక్స్మి-లాంటేషన్‌గా తీర్చిదిద్దాలని గతంలోనే అధికారులకు మంత్రి సూచించారు. ఇందుకు అనుగుణంగా అన్నిరకాల గుండె సంబంధిత ఆపరేషన్లు చేసేలా, అవయవమార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించేలా క్యాథల్యాబ్స్, ఆర్గాన్ ట్రాన్స్‌ఎక్స్మి-లాంట్ థియేటర్ల ఏర్పాటుపై మంత్రి ఆరా తీశారు. క్యాథల్యాబ్ ఏర్పాటు పనులు పూర్తయ్యాయని, ట్రయల్ రన్‌కు సిద్ధంగా ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. మెడికల్ సర్వీసెస్‌తో పాటు సానిటేషన్, సెక్యూరిటీ వంటి నాన్ మెడికల్ సర్వీసెస్ విభాగాలు కూడా పటిష్టంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. పేషెంట్లు, వారి అటెండెంట్లకు భోజన సదుపాయం కల్పించాలని, అటెండెంట్ల కోసం ధర్మశాలను సైతం సిద్ధం చేయాలని మంత్రి సూచించారు.

# మే నెలాఖరుకు 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్



- **రామగుండం ఎరువుల కర్మాగారం నుండి 90 శాతం సరఫరా చేయాలి**
- **రైతులకు నానో యూరియాపై కంపెనీలు కూడా అవగాహన కల్పించాలి**
- **ఎమ్మార్పి కంటే ఎక్కువ ధరకు ఎరువుల అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు**
- **సేంద్రియ వ్యవసాయానికి కేంద్రం ప్రోత్సహకాలు అందించాలి.**
- **రాష్ట్ర ఫెర్టిలైజర్ యాప్ మార్గదర్శకంగా కేంద్రం సరికొత్త యాప్**
- **ఎరువుల కంపెనీల ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమీక్ష**

**బలగం టీవి, హైదరాబాద్**

జూన్ మొదటి వారంలో రాష్ట్రంలో వరి నాట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున, మే నెలాఖరు నాటికి కనీసం 3.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. కేంద్రం నుంచి రావాల్సిన మిగిలిన యూరియాను అత్యవసరంగా రాష్ట్రానికి తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా సరఫరా, నిల్వలు మరియు నానో యూరియా వినియోగంపై వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత / జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం సచివాలయంలో ఎరువుల కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో 1.46 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్‌తో పాటు సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ మరియు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఖరీఫ్ 2026 సీజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా, కేంద్రం 10 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందన్నారు. ఆ కేటాయింపుల ప్రకారం ఏప్రిల్, మే, జూన్ నెలల్లో నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నులు, జూలై మరియు ఆగస్టు నెలల్లో నెలకు 1.50 లక్షల మెట్రిక్ టన్నులు, సెప్టెంబర్‌లో 1 లక్ష మెట్రిక్ టన్నుల సరఫరా ఉంటుందని కేంద్రం తెలిపిందన్నారు. ఏప్రిల్ నెలలో కేటాయించిన 2 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 1.53 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే రాష్ట్రానికి చేరాయని, మే నెలలో ఇప్పటివరకు 48,985 మెట్రిక్ టన్నులు అందాయని అధికారులు వివరించారు. క్ష్మీరాష్ట్రంలోనే ఉన్న రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే యూరియాలో కనీసం 90 శాతం తెలంగాణ అవసరాలకే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి డిమాండ్ చేశారు. రాష్ట్ర వనరులను వినియోగించి ఇక్కడే ఉత్పత్తి జరుగుతున్న యూరియా, రాష్ట్ర రైతులకు అవసరమైన సమయంలో అందకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ అంశంపై రామగుండం ఎరువుల కర్మాగారం మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. గత నెలలో కేటాయింపుల మేరకు సరఫరా చేయని కంపెనీలు, మిగిలిన పరిమాణంతో పాటు ఈ నెల కోటాను కూడా సమయానికి సరఫరా చేయాలని మంత్రి స్పష్టం చేశారు. రేక్ పాయింట్లకు చేరిన యూరియాను జిల్లాలకు తరలించే పక్రియలో ఎటువంటి జాప్యం జరగకూడదని, హ్యాండ్లింగ్ మరియు రవాణాలో నిర్లక్ష్యం కనబరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులను హోల్ సేల్ మరియు రిటైల్ లో ఎమ్మార్పి కంటే ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. రాష్ట్ర యూరియా యాప్ ను మార్గదర్శకంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఎరువులను అందించేందుకు ఒక సరికొత్త యాప్ ను తీసుకువస్తుందని మంత్రి అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలోని రెండు జిల్లాలలో ఈ యాప్ ను ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. మన రాష్ట్రంలో

రంగారెడ్డి మరియు మేడ్చల్ జిల్లాలలో ఈ యాప్ ను అమలు చేయనున్నారని మంత్రి తెలిపారు.

క్ష్మీరాష్ట్రంలో నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. నానో యూరియా తయారీ సంస్థలు కూడా అవగాహన కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. నానో యూరియా వాడుతున్న రైతుల అనుభవాలను వీడియో రూపంలో చిత్రీకరించి 'రైతు నేస్తం' కార్యక్రమంలో ప్రసారం చేయాలని సూచించారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు పాల్గొని, సాధారణ యూరియా అధిక వినియోగం వల్ల కలిగే నష్టాలు, నానో యూరియా ప్రయోజనాలపై రైతులకు వివరించాలని ఆదేశించారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాలని మంత్రి కోరారు. రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. యూరియాను అధికంగా వినియోగించడం వల్ల భూసారం దెబ్బతిని, భవిష్యత్తులో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకొని, ఆ ఫలితాల ఆధారంగా అవసరమైన ఎరువులను మాత్రమే వినియోగిస్తే భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.

ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేంద్ర మోహన్, అగ్రికల్చర్ / ఫార్మర్స్ వెల్ఫేర్ డిజిటల్ వింగ్ డైరెక్టర్ సరితా లక్ష్మీ, వ్యవసాయశాఖ డైరెక్టర్ డా. గోపి, ఎరువుల కంపెనీల ప్రతినిధులు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కొహెడ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి చర్యలు

**డిసెంబర్ 9 నుంచి సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు - మంత్రి తుమ్మల**

**బలగం టీవి, హైదరాబాద్**



రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థను ఆధునీకరించే దిశగా కీలకంగా భావిస్తున్న కొహెడ సమగ్ర మార్కెట్ నిర్మాణ పనులు తుది దశలోకి చేరుకున్నాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత మరియు జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు కొహెడ సమగ్ర మార్కెట్‌కు సంబంధించిన సవరించిన లేఅవుట్‌పై మార్కెటింగ్ అధికారులతో ఈ రోజు సచివాలయంలో సమగ్ర సమీక్ష నిర్వహించిన మంత్రి తుమ్మల... రైతులు, వ్యాపారులు మరియు ఇతర భాగస్వాముల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు రూపకల్పనను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దినట్లు వెల్లడించారు. ప్రాజెక్టును 3 దశలలో పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. తొలి దశ నిర్మాణ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి, ఈ ఏడాది డిసెంబర్ 9న మార్కెట్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం బాటసింగారం మార్కెట్‌లో కొనసాగుతున్న లావాదేవీలను కొహెడ సమగ్ర మార్కెట్‌కు సాఫీగా తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రైతులు, వ్యాపారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సమన్వయంతో తరలింపు పక్రియను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 9 నుంచే కొహెడ మార్కెట్‌లో లావాదేవీలు ప్రారంభమయ్యేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కొహెడ సమగ్ర మార్కెట్‌ను అత్యాధునిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఓపెన్ ఎక్ష్మి-లాట్‌ఫారాలు, ట్రక్ డాకింగ్ షెడ్లు, డ్రైయింగ్ యార్డులు, విశాల రహదారులు, రవాణా సౌకర్యాలు, పారదర్శక లావాదేవీల కోసం సాంకేతిక వసతులు, రైతులకు అవసరమైన అన్ని సేవలను అందుబాటులో ఉంచేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. సమగ్ర మార్కెట్ ద్వారా రైతులకు తమ ఉత్పత్తులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు, మధ్యవర్తుల ప్రభావం తగ్గి, పారదర్శక మార్కెటింగ్ వ్యవస్థ ఏర్పడుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధిలో కొహెడ సమగ్ర మార్కెట్ మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. ప్రాజెక్టును నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. ప్రాజెక్టుకు

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- **రాబోయే 15 రోజుల్లో 90% మ్యాపింగ్ పూర్తి చేయాలి**
- **ఏ నిజమైన ఓటరు ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలి**
- **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**
- **అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**
- **హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**




ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా తాజా ఓటరు జాబితాను 2002 ఎస్ఐఆర్ జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.




సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ మ్యాపింగ్ పురోగతిని సమీక్షించారు.జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో రాబోయే 15 రోజుల్లో కనీసం 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. స్టేషన్ ఘన్‌పూర్, అశ్వారావుపేట వంటి నియోజకవర్గాలు ఇప్పటికే 80 శాతానికి పైగా మ్యాపింగ్ పూర్తి చేశాయని తెలిపారు. ఒడిశా రాష్ట్రం ఇప్పటికే 90 శాతం, కర్ణాటక 81 శాతం, మహారాష్ట్ర 68 శాతం మ్యాపింగ్ పూర్తి చేశాయని, తెలంగాణ ఇంకా వెనుకబడి ఉందని పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల అధికారులు తమ బృందాలను ప్రోత్సహించి మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను అన్ని వనరుల నుంచి గుర్తించి నియమించుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రారంభమైన తర్వాత ప్రతిరోజూ ఫారాల పంపిణీ, సేకరణపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు తమ ప్రాంతంలోని బీఎల్ఓ ఎవరో తెలిసేలా చర్యలు తీసుకోవాలని, ఏ నిజమైన ఓటరు తన ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని ఆదేశించారు. మ్యాపింగ్ పురోగతిని పెంచేందుకు ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళల సహకారాన్ని కూడా వినియోగించుకోవాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పంజాబ్‌కు షాక్.. ఢిల్లీ 'కెపిటల్' విక్టరీ!

- వరుసగా నాలుగో ఓటమి మూటగట్టుకున్న కింగ్స్
- అక్షర్, మిల్లర్ అర్ధశతకాల విధ్వంసం..
- ప్లే ఆఫ్స్ రేసులో నిలిచిన ఢిల్లీ



**బలగం టీవీ, ధర్మశాల**

ఐపీఎల్ 19వ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. సొంత మైదానంలో పంజాబ్ నిర్దేశించిన 211 పరుగుల భారీ లక్ష్యాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ మరో మూడు బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో ఢిల్లీ 3 వికెట్ల తేడాతో విజయం సాధించి ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకోగా, పంజాబ్ వరుసగా నాలుగో ఓటమితో డీలా పడింది.

భారీ ఛేదనలో ఢిల్లీకి ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. యశ్ ఠాకూర్, అర్ష్‌దీప్ సింగ్‌ల ధాటికి ఓపెనర్లు అభిషేక్ పొరెల్ (5), కేఎల్ రాహుల్ (9) త్వరగానే పెవిలియన్ చేరారు. సహిల్ పరాక్ (0) కూడా నిరాశపరచడంతో 14 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ఢిల్లీ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో కెప్టెన్ అక్షర్ పటేల్ (56), స్టబ్స్ (12) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. అక్షర్ దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగెత్తించాడు.

**మిల్లర్ 'కిల్లర్' ఇన్నింగ్స్**

అక్షర్ అవుటైన తర్వాత క్రీజులోకి వచ్చిన డేవిడ్ మిల్లర్ (51) తనదైన శైలిలో విరుచుకుపడ్డాడు. ద్వారుషీ బౌలింగ్‌లో వరుస సిక్సర్లతో విరుచుకుపడి మ్యాచ్‌ను ఢిల్లీ వైపు తిప్పాడు. మిల్లర్ అవుటైన తర్వాత మ్యాచ్ ఉత్కంఠగా మారినప్పటికీ, ఇంప్యాక్ట్ సబ్ అశుతోష్ శర్మ (24), మధవ్ తివారీ (18 నాటౌట్), అకీబ్ నబీ (10 నాటౌట్) బాధ్యతాయుతంగా ఆడి జట్టును విజయతీరాలకు చేర్చారు. ముఖ్యంగా అకీబ్ నబీ వస్తూనే ఫోర్, సిక్సర్‌తో లాంఛనాన్ని పూర్తి చేశాడు.

**పంజాబ్ భారీ స్కోర్ వృథా**

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 210 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య (56) మెరుపు ఆరంభాన్ని ఇవ్వగా, మిడిల్ ఓవర్లలో శ్రేయాస్ అయ్యర్ (59 నాటౌట్) బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడాడు. కూపర్ కొన్నొల్లీ (38), సూర్యాన్ష్ షెడ్గే (21 నాటౌట్) మెరుపులు మెరిపించడంతో పంజాబ్ స్కోరు 200 దాటింది. ఢిల్లీ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 2 వికెట్లు తీసినప్పటికీ భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. చివరి ఓవర్లో ఎంగిడి కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పంజాబ్ 210 పరుగుల వద్ద ఆగింది.

**ప్రియాన్ష్ ఆర్యపరుగుల విధ్వంసం**

ధర్మశాల వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ ముందుగా పంజాబ్ జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. అయితే, ప్రియాన్ష్ ఆర్య రూపంలో తన నిర్ణయం ఎంత తప్పో అతనికి వెంటనే అర్థమైంది. ఇన్నింగ్స్ తొలి బంతికే మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లో భారీ సిక్సర్ బాదిన ఆర్య, తన ఉద్దేశాన్ని స్పష్టం చేశాడు. మైదానం నలుమూలలా బౌండరీల వర్షం కురిపిస్తూ కేవలం ఆరు ఓవర్ల లోపే ఢిల్లీ బౌలింగ్ విభాగాన్ని చిన్నాభిన్నం చేశాడు. ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో ప్రియాన్ష్ ఆర్య ఒక అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలో పవర్ ప్లే (తొలి 6 ఓవర్లు) ముగియకముందే అత్యధిక సార్లు 50 కంటే ఎక్కువ పరుగులు చేసిన భారతీయ ఆటగాళ్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ 4 సార్లు ఈ ఘనత సాధించి అగ్రస్థానంలో ఉండగా, ప్రియాన్ష్ 3 సార్లతో రెండో స్థానంలో నిలిచాడు.మ్యాచ్ ఆరంభమైన మొదటి బంతికే సిక్సర్ కొట్టడం ప్రియాన్ష్‌కు ఇది కొత్తేమీ కాదు. 2025 సీజన్‌లో ఖలీల్ అహ్మద్ బౌలింగ్‌లో తొలి బంతిని స్టాండ్స్‌కు పంపిన ఆర్య, ఇప్పుడు స్టార్క్ బౌలింగ్‌లోనూ అదే పునరావృతం చేశాడు. ఐపీఎల్ చరిత్రలో ఇన్నింగ్స్ తొలి బంతికే అత్యధికంగా 4 సార్లు సిక్సర్లు బాదిన రికార్డు యశస్వి జైస్వాల్ పేరిట ఉండగా, ప్రియాన్ష్ ఆర్య ఇప్పటికే 3 సార్లు ఈ ఫీట్ సాధించి అతనికి చేరువయ్యాడు. గత సీజన్‌లో పంజాబ్ జట్టు ఫైనల్ వరకు వెళ్లడంలో ప్రియాన్ష్ ఆర్య కీలక పాత్ర పోషించాడు. ఈ ఏడాది కూడా ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌తో కలిసి అతను అందిస్తున్న ఆరంభాలు జట్టును పట్టికలో అగ్రస్థానానికి చేరుస్తున్నాయి. కేవలం వేగంగా ఆడటమే కాకుండా, నిలకడగా పరుగులు సాధిస్తూ పంజాబ్ కింగ్స్ పెట్టుకున్న నమ్మకాన్ని ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ నిజం చేస్తున్నాడు.

**స్కోరు వివరాలు**

పంజాబ్ కింగ్స్:లిలి 210/4 (శ్రేయాస్ అయ్యర్ 59లి, ప్రియాన్ష్ ఆర్య 56; మిచెల్ స్టార్క్ 2/57)

ఢిల్లీ క్యాపిటల్స్:లిలి 214/7 (అక్షర్ పటేల్ 56, డేవిడ్ మిల్లర్ 51; అర్ష్‌దీప్ సింగ్ 2 వికెట్లు)

# ఆఫ్ఘాన్‌తో తలపడే భారత జట్టు ఇదేనా?



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

అజిత్ అగార్కర్ నేతృత్వంలోని బీసీసీఐ సెలక్షన్ కమిటీ, ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న ఏకైక టెస్ట్ మ్యాచ్ కోసం భారత బ్యాటింగ్ విభాగంలోని ప్రధాన ఆటగాళ్లను కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ జట్టు భారత్‌లో పర్యటించి ఒక టెస్ట్ మ్యాచ్, మూడు వన్డేలు ఆడనుంది. ఈ ఏకైక టెస్ట్ మ్యాచ్ జూన్ 6 నుంచి 10 వరకు చండీగఢ్‌లోని ముల్లన్‌పూర్ స్టేడియంలో జరగనుంది. కాగా, ఈ మ్యాచ్‌కు సంబంధించిన భారత టెస్ట్ జట్టు వివరాలు లీక్ అయ్యాయి. ఇందులో గుజరాత్ టైటాన్స్ స్టార్ ప్లేయర్‌ను తప్పించినట్లు సమాచారం. మ్స్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం, బ్యాటింగ్ కోర్ గ్రూపులో సెలక్టర్లు ఎలాంటి మార్పులు చేయడం లేదు. గతంలో శుభ్‌మన్ గిల్‌కు విశ్రాంతినిస్తారని వార్తలు వచ్చినప్పటికీ, తాజా నివేదికల ప్రకారం గిల్ జట్టులో ఉండటమే కాకుండా జట్టును నడిపించే అవకాశం ఉంది. ఈ జట్టులో కేఎల్ రాహుల్, రిషబ్ పంత్, యశస్వి జైస్వాల్ వంటి అనుభవజ్ఞులు ఉండనున్నారు. గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ బి. సాయి సుదర్శన్ టెస్ట్ క్రికెట్‌లో ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో (సగటు 27.4), అతని స్థానంలో కర్ణాటక బ్యాటర్ దేవదత్ పడిక్కల్‌ను ఎంపిక చేసే అవకాశం ఉంది. పడిక్కల్ డొమెస్టిక్ క్రికెట్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా గాయాల బెడద దృష్ట్యా, ఈ టెస్ట్ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ లో భాగం కానందున అతనికి విశ్రాంతినివ్వనున్నారు. మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణల ఎంపిక ఐపీఎల్ పనిభారంపై ఆధారపడి ఉంటుంది. రంజీ ట్రోఫీలో రాణించిన ఆకిబ్ నబీ వంటి కొత్త ముఖాలకు అవకాశం దక్కవచ్చు.

ఆఫ్ఘనిస్తాన్‌తో తలపడే భారత ప్రాబబుల్ టెస్ట్ జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, దేవదత్ పడిక్కల్, రిషబ్ పంత్ (కీపర్), ధ్రువ్ జురెల్ (కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, ఆకిబ్ నబీ, హర్ష్ దూబే, మహమ్మద్ షమీ, అన్షుల్ కాంబోజ్.

# కోహ్లీ ఆల్‌టైమ్ గ్రేట్ ప్లేయర్: కృనాల్ పాండ్యా



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీపై ఆ జట్టు ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యా ప్రశంసల జల్లు కురిపించాడు. విరాట్ కోహ్లీ ఆల్‌టైమ్ గ్రేట్ ప్లేయర్ అని కొనియాడాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ 2 వికెట్లతో స్టన్నింగ్ విక్టరీ అందుకుంది.కృనాల్ పాండ్యా(46 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 73) అద్భుతమైన హాఫ్ సెంచరీతో ఆర్‌సీబీ విజయంలో కీలక పాత్ర పోషించాడు. 39 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ ఆర్‌సీబీని కృనాల్ ఆదుకున్నాడు.ఈ మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న కృనాల్ పాండ్యా గతేడాది కూడా ఈ తరహా మ్యాచ్ ఒకటి ఆడినట్లు గుర్తు చేసుకున్నాడు. అయితే ఆ మ్యాచ్‌లో తనకు అండగా విరాట్ కోహ్లీ ఉన్నాడని గుర్తు చేసుకున్నాడు. టీమిండియాకు ఆడటమే తన లక్ష్యమని, అందుకోసం తీవ్రంగా కష్టపడుతున్నానని చెప్పుకొచ్చాడు.' గతేడాది కూడా మాకు ఇలాంటి పరిస్థితే ఎదురైంది. అప్పుడు మేం 25 పరుగులకే 3 వికెట్లు కోల్పోయాం. అప్పుడు కూడా నేనే బ్యాటింగ్‌కు వచ్చాను. కానీ ఆ మ్యాచ్‌లో నా ముందు ఒక '+ఊూ' నిలబడి ఉన్నాడు. అతని పేరే విరాట్ కోహ్లీ. విరాట్ కోహ్లీ మరో ఎండ్‌లో ఉన్నప్పుడు పనులు చాలా సులువు అవుతాయి. అతను మైదానంలోకి తీసుకువచ్చే ఆరా, శక్తి మరేదానితోనూ సరితూగవు. ఈ మ్యాచ్‌లో నేను కండరాల నొప్పులతో బాధపడ్డాను. ఆ నొప్పులు కాలి పిక్కల దగ్గర మొదలై తొడ కండరాలు, గ్లూట్స్ వరకు వ్యాపించాయి. నా రెండు కాళ్లు తిమ్మిర్లు పట్టేశాయి. కానీ నేను మాత్రం ఏది ఏమైనా.. మైదానం వీడకూడదని అనుకున్నాను. ఆ నొప్పిని భరిస్తూనే నా జట్టు కోసం పోరాడాలని, నా వంతు సహకారం అందించాలని నిశ్చయించుకున్నా. నేను గతంలోనే చెప్పాను. నాకు ఆరేడేళ్ల వయసున్నప్పటి నుంచే దేశం కోసం ఆడాలనేది నా మొదటి కల. అందులో ఎలాంటి మార్పు లేదు. నా 100 శాతం లక్ష్యం మళ్ళీ భారత్ తరపున ఆడటమే. వచ్చే ఏడాది 2027 ప్రపంచకప్ రాబోతోంది. కాబట్టి నా ప్రయత్నం నేను చేస్తాను.'అని కృనాల్ పాండ్యా చెప్పుకొచ్చాడు.

# తమిళనాడు సిఎం విజయ్ ఆదర్శం



**స్టాలన్, వైకోల ఇంటికి వెళ్లి వారితో భేటీ**

**మర్యాదపూర్వకంగా కలుసుకున్న సిఎం**

**ఎమ్మెల్యేగా సోమవారం అసెంబ్లీలో ప్రమాణం**

**బలగం టీవీ, చెన్నై**

తమిళనాడు కొత్త సీఎం విజయ్ – మాజీ సీఎం ఎంకే స్టాలిన్ తో భేటీ అయ్యారు. టీవీకే చీఫ్ సోమవారం డీఎంకే అధినేత నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. స్టాలిన్ నివాసంలో జరిగిన ఈ భేటీలో మాజీ ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు. ఈ నేతలు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్ర ఖజానాను గత డీఎంకే ప్రభుత్వం ఖాళీ చేసిందని ఇప్పటికే విజయ్ ఆరోపించారు. దీనికి స్టాలిన్ కూడా బదులిచ్చారు. అప్పులు పరిమితికి లోబడే ఉన్నాయన్నారు. కొవిడ్ లాంటి విపత్తును ఎదుర్కొని, నిధులు ఇవ్వడంలో అడ్డంకులు సృష్టించిన భాజపాను తట్టుకుని దీటుగా నిలబడ్డామని తెలిపారు. ఈ నేపథ్యంలో వీరిద్దరు సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. టీవీకే విజయ్ నేతృత్వంలో ఆదివారం తమిళనాడులో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. మే 13న ఈ ప్రభుత్వం అసెంబ్లీలో బలపరీక్ష ఎదుర్కోనుంది. మరోవైపు నేడు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. సిఎం విజయ్ ముందుగా ప్రమాణం చేశారు.

ఈ సందర్భంగా అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. నిన్న మంత్రిగా ప్రమాణం చేసిన యువనేత కీర్తన.. నేడు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయలేకపోయారు. ఎలక్షన్ సర్టిఫికేట్‌ను తీసుకు రాకపోవడమే అందుకు కారణం. తర్వాత వెనక్కి వెళ్లిన ఆమె దానిని తీసుకొచ్చి, సమర్పించడంతో ఎట్టకేలకు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు. ఇకపోతే సాధారణ స్థాయి నుంచి వచ్చానంటూ తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకార కార్యక్రమం నుంచి నిరాడంబరతను చాటుకుంటున్న విజయ్ వరుస ప్రశంసలు అందుకుంటున్నారు. పార్టీలకు అతీతంగా రాజకీయ ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలుస్తున్నారు. చెన్నైలోని ఎండీఎంకే చీఫ్ వైకో ను సోమవారంనాడు ఆయన నివాసానికి వెళ్లి విజయ్ కలుసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ఫోటోలు దిగారు. అనంతరం వైకో ఇంట్లో పనిచేసే మహిళా సిబ్బందిని సైతం ఆత్మీయంగా పలుకరించడంతో వారు ఉద్వేగానికి లోనయ్యారు. విజయ్ నిరాడంబరతకు ఇది నిదర్శనమంటూ ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. వైకో ఇంటికి వచ్చిన విజయ్‌కు ఆయన సాదర స్వాగతం పలికారు. తన కుటుంబ సభ్యులను పరిచయం చేశారు. అనంతరం తన ఇంట్లో పనిచేసే మహిళా సిబ్బందిని పరిచయం చేస్తూ, వీరంతా విజయ్‌కు పెద్ద అభిమానులనీ, విజిల్ గుర్తుకే ఓటు వేశారని చెప్పడంతో అక్కడ అహ్లాద వాతావరణం నెలకొంది. తమ అభిమాన నటుడిని అంత దగ్గరగా చూడటంతో వారు ఉద్వేగానికి లోనయ్యారు. విజయ్ సైతం ఎంతో ఆప్యాయంగా పలకరిస్తూ వారితో ఫోటోలు దిగారు. విజయ్ సాధారణ వ్యక్తిత్వం, నిరాడంబరతకు ఇది నిదర్శనమంటూ నెటిజెన్లు ఆయనపై ప్రశంసలు కురిపిస్తున్నారు. వైకో పట్ల విజయ్ సైతం తన అభిమానాన్ని చాటుకున్నారు. వైకో ప్రసంగాలు, రాజకీయ సామర్థ్యాన్ని ప్రశంసించారు. 'నేను మీ అభిమానిని' అంటూ చెప్పారు. ఎన్నికల ప్రచారంలో తొలి రాజకీయ ప్రసంగం విక్రవాండిలో చేశానని, ఆ ప్రసంగానికి ముందు తాను వైకో ప్రసంగాలను పదేపదే చూశానని తెలిపారు.







# ఊర్విల్ పటేల్ అరుదైన రికార్డు

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఐపీఎల్ 2026 సీజన్‌లో ఒక అద్భుతం చోటుచేసుకుంది. చెన్నై సూపర్ సింగ్స్ యువ ఆటగాడు ఊర్విల్ పటేల్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగిపోయాడు. కేవలం 13 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగంగా 50 పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో చేరిపోయాడు. నేడు చెన్నై వేదికగా లక్నో సూపర్ జయంట్స్ తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఫీట్ సాధించాడు. దీంతో సురేష్ రైనా పేరిట ఉన్న పదేళ్ల రికార్డును సమం చేశాడు. రైనా 2014లో పంజాబ్ మీదనే 13 బంతుల్లో హాఫ్ సెంచరీ బాదాడు. ఇప్పుడు ఊర్విల్ అదే ఘనత సాధించడం విశేషం. మైదానం నలుమూలలా ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడుతూ ప్రత్యర్థి బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. ఈ ఇన్నింగ్స్ చూసిన అభిమానులు ఆశ్చర్యంలో మునిగిపోయారు. పవర్ ప్లే సమయంలోనే ఊర్విల్ తన బ్యాట్ పవర్ ఏంటో చూపించాడు. గ్రౌండ్‌లో ప్రతి బంతిని బౌండరీకి పంపుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. తన అద్భుతమైన హిట్టింగ్ తో స్టేడియం మొత్తం హోరెత్తిపోయేలా చేశాడు. లక్నో బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా విరుచుకుపడ్డాడు. తన ఇన్నింగ్స్‌లో మొత్తం 8 సిక్సర్లు, 2 ఫోర్లు బాదాడు. పవర్ ప్లే ముగియకముందే తన హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. వేలంలో తక్కువ ధరకు అమ్ముడైన ఈ ఆటగాడు ఇప్పుడు సంచలనంగా మారాడు. జట్టు విజయంలో కీలక పాత్ర పోషిస్తూ అందరి దృష్టిని ఆకర్షించాడు.గతంలో సురేష్ రైనా 2014లో పంజాబ్ మీదనే కేవలం 13 బంతుల్లో యాభై పరుగులు చేశాడు. దశాబ్ద కాలంగా ఆ రికార్డు చెక్కుచెదరకుండా ఉంది. ఇప్పుడు ఊర్విల్ పటేల్ రైనాతో కలిసి ఉమ్మడి రికార్డును నెలకొల్పాడు. ఐపీఎల్ లో అత్యంత వేగంగా హాఫ్ సెంచరీ చేసిన రికార్డు యశస్వి జైస్వాల్ (13 బంతులు) పేరిట ఉంది. కెఎల్ రాహుల్ 14 బంతుల్లో ఈ ఘనత సాధించాడు.



# ముంబై ఇండియన్స్‌కు హార్దిక్ పాండ్యా గుడ్ బై..?

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ముంబై ఇండియన్స్‌లో ఏం జరుగుతోంది..? కెప్టెన్ హార్దిక్ పాండ్యా నిజంగానే గాయపడ్డాడా..? లేదా కావాలనే గత రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడా..? మేనేజ్‌మెంట్‌తో విభేదాల రావడంతో టీమ్‌ను వీడాలని నిర్ణయించుకున్నాడా..? ఈ ప్రశ్నలకు బలాన్ని చేకూర్చేలా ముంబై ఇండియన్స్ అకౌంట్‌ను అన్‌ఫాలో చేసి.. కొన్ని గంటల తర్వాత మళ్లీ ఫాలో చేయడం చర్చనీయాంశంగా మారింది. తన సోషల్ మీడియా ఖాతాల్లో ముంబై ఇండియన్స్‌కు చెందిన పోస్టులను మొత్తం డిలీట్ చేశాడు. గత సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు చేరిన ముంబై.. ఈసారి దారుణమైన ప్రదర్శనతో పాయింట్ల పట్టికలో కింది నుంచి రెండోస్థానంలో ఉంది. ఆడిన 11 మ్యాచ్‌ల్లో కేవలం మూడు విజయాలు మాత్రమే సాధించింది. ప్లే ఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా తప్పుకుంది. మొదటి మ్యాచ్‌ను విజయంతో ఆరంభించినా.. ఆ తరువాత టీమ్ పూర్తిగా గాడి తప్పింది. రోహిత్ శర్మ గాయం కారణంగా నాలుగు మ్యాచ్‌లు దూరం కావడం.. బుమ్రా వికెట్లు తీయకపోవడం.. సూర్యకుమార్ యాదవ్ పూర్ ఫామ్‌లో ఉండడం.. బౌలింగ్, బ్యాటింగ్ రెండింటిలో పాండ్యా విఫలమవ్వడం.. జట్టు ప్రదర్శనపై తీవ్ర ప్రభావం చూపించింది. ఈ సీజన్‌లో పాండ్యా మూడు మ్యాచ్‌ల్లో ఆడలేదు. పాండ్యా స్థానంలో సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. ఈ నేపథ్యంలోనే సోషల్ మీడియాలో పాండ్యాపై వార్తలు మొదలయ్యాయి. వచ్చే సీజన్‌కు పాండ్యా మరో జట్టులోకి వెళతాడని ప్రచారం మొదలుపెట్టారు. తన మాజీ టీమ్ గుజరాత్ టైటాన్స్‌లోకి మళ్లీ వెళ్లిపోతాడని రూమర్లు అంటూ స్టార్ చేశారు. హెడ్ ఆశిష్ నెహ్రాకు కాల్ చేసి.. 'నెహ్రా.. జీ నేను వచ్చేస్తున్నా..' అన్నాడని ట్రోల్స్ చేస్తున్నారు. హార్దిక్ పాండ్యా గాయంపై ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్ మహేల జయవర్ధనే కీలకమైన అప్‌డేట్ ఇచ్చారు. పాండ్యా వెన్నునొప్పి సమస్యతో బాధపడుతున్నాడని.. వైద్య బృందం పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నాడని వెల్లడించారు. అతని ఫిట్‌నెస్ విషయంలో జట్టు యాజమాన్యం ఎలాంటి రిస్క్ తీసుకోవాలనుకోలేదని.. అందుకే ఆర్‌సీబీతో జరిగిన మ్యాచ్‌కు అతనికి విశ్రాంతినిచ్చినట్లు తెలిపారు. అతని పరిస్థితిని బట్టి వచ్చే మ్యాచ్‌కు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

# నిశ్శబ్ద సేవకురాలు నర్సు


**బలగం టీవీ, ఆలేరు;**

నైటింగేల్ చూపిన మార్గం ఎంచుకొని....
అనురాగ హస్తాలతో ప్రాణాలు కాపాడే యోధులు..!
వేతనం తక్కువైనా...
అలసట ఎక్కువైనా....
కరోన లాంటి సమయంలో మృత్యువుకు భయపడకుండా సేవలందించి...
నైటింగేల్ వారసులై నిలిచిన నిశ్శబ్ద వీరులు..!
మరణాన్ని జయించిన ప్రతి శ్వాస వెనుక...
ఒక నర్సు త్యాగం నిశ్శబ్దంగా నిలుస్తుంది..!
తమ బాధలు హృదయంలో దాచుకుని, చిరునవ్వు చిందిస్తూ రోగికి ఆశల ఔషధ గంధం
ఇచ్చి ధైర్యం ఇస్తుంది..!
సాటి ప్రాణాల కోసం అంకితమైన మీ జీవనం మరిచిపోలేదు మేము..!
రాత్రింబవళ్లు అనక సేవలందిస్తూ...
అలసిన కళ్లలోనూ ఆశ వెలిగిస్తూ...
మానవత్వానికి నిజమైన నిర్వచనం
ఐనా మిమ్ములను మరిచిపోలేదు మేము..!
ప్రతి నర్సుకి వందనం, సేవకు శతకోటి నమనం
అంతర్జాతీయ నర్సుల దినోత్సవ(మే 12) శుభాకాంక్షలందనం.



**రచన: పత్తిపాటి మంజుల**
**ఆలేరు వ్యవసాయ మార్కెట్ మాజీ కమిటీ డైరెక్టర్**
**యాదాద్రి భువనగిరి జిల్లా,తెలంగాణ రాష్ట్రం**
**చరవాణి 9347042218.**

# భువనేశ్వర్ అరుదైన ఘనత



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్ భువనేశ్వర్ కుమార్ అద్భుత ప్రదర్శన చేస్తున్నాడు. ముంబైతో ఆదివారం రాత్రి జరిగిన సీజన్ 54వ మ్యాచ్‌లో భువీ అదరగొట్టాడు. తద్వారా 19 ఏళ్ల టోర్నీ చరిత్రలో కేవలం రెండోసారి మాత్రమే నమోదైన ఒక అద్భుతమైన రికార్డు తన ఖాతాలో వేసుకున్నాడు. భువీ కేవలం రికార్డు మాత్రమే కాదు, ఎన్నటికీ చెరిగిపోని ఫీట్ లిఖించుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్‌లో 6 సార్లు 3 వికెట్ల హాల్ సాధించిన రెండో బౌలర్‌గా ఆర్సీబీ పేసర్ భువనేశ్వర్ నిలిచాడు. అంతకుముందు ఈ ఘనతను 2021లో హర్షల్ పటేల్ మొదటిసారి సాధించాడు. అయితే హర్షల్ రికార్డును బద్దలు కొట్టే అవకాశం భువీకి ఉంది. ఎందుకంటే ఆర్‌సీబీ ముంబైపై తన 11వ లీగ్ మ్యాచ్ ఆడింది. జట్టు మరో 3 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. అందులో భువీ కేవలం ఒక్కసారి 3 వికెట్ల హాల్ సాధిస్తే హర్షల్ పటేల్ రికార్డును బద్దలు కొట్టవచ్చు. ముంబైతో జరిగిన మ్యాచ్‌లో భువనేశ్వర్ కుమార్ 4 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ క్రమంలో భువీ 4 ఓవర్లలో కేవలం 23 పరుగులు మాత్రమే ఇవ్వగా, ఎకానమీ 5.80గా ఉంది. ముంబైతో మ్యాచులో 4 వికెట్లు తీయడం ద్వారా భువీ పర్పుల్ క్యాప్‌ను మరోసారి అందుకున్నాడు. భువీ ఇప్పటివరకు 11 మ్యాచ్‌లలోని 11 ఇన్నింగ్స్‌ల్లో 15.28 సగటుతో 21 వికెట్లు పడగొట్టాడు. ఇందులో అత్యుత్తమ ప్రదర్శన 4/23గా ఉంది. ఆయన ఎకానమీ 7.46గా ఉంది. భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్ కెరీర్ విషయానికి వస్తే.. ఇప్పటివరకు భువీ టోర్నీలో 201 మ్యాచ్‌లు ఆడారు. ఈ మ్యాచ్‌లలోని 201 ఇన్నింగ్స్‌ల్లో బౌలింగ్‌లో 26.17 సగటుతో 219 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అందులో అత్యుత్తమ ప్రదర్శన 5/19గా ఉంది. భువీ ఇప్పటికే 2 సార్లు 5 వికెట్ల హాల్ సాధించగా.. ఆయన ఎకానమీ 7.67గా ఉంది. భువనేశ్వర్ 2011 నుండి ఐపీఎల్‌లో ఆడుతున్నాడు. ఐపీఎల్ 2026లో భాగంగా ఆదివారం రాయ్‌పూర్‌లో జరిగిన ఉత్కంఠభరిత పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 2 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ముంబై, తెలుగు స్టార్ తిలక్ వర్మ (57) అర్ధశతకంతో నిర్ణీత ఓవర్లలో 166 పరుగులు చేసింది. ఆర్‌సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 4 వికెట్లతో రాణించి 'పర్పుల్ క్యాప్' కైవసం చేసుకున్నాడు. అనంతరం 167 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్‌సీబీ ఆల్ రౌండర్ కృనాల్ పాండ్యా (73) వీరోచిత ఇన్నింగ్స్‌తో చివరి బంతికి లక్ష్యాన్ని చేరుకుంది. ముంబై బౌలర్ కార్బిన్ బాష్ 4 వికెట్లు తీసినప్పటికీ ఆర్‌సీబీ విజయాన్ని అడ్డుకోలేకపోయాడు. ఈ గెలుపుతో 14 పాయింట్లతో ఆర్‌సీబీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరగా, ముంబై.. లక్నో జట్లు టోర్నీ నుండి అధికారికంగా నిష్క్రమించాయి. సోమవారం జరగనున్న తదుపరి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడనుంది.

# 'పని రాక్షసుడు' నాని..



## 'ప్యారడైజ్' కోసం నేచురల్ స్టార్ పడుతున్న కష్టం ఇదే!

నాని.. ఈ పేరు ఇప్పుడు తెలుగు సినీ ఇండస్ట్రీలో ఒక బ్రాండ్‌గా మారిపోయింది. అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన, తన టాలెంట్, కష్టంతో నేచురల్ స్టార్ స్థాయికి ఎదిగారు. ప్రతి పాత్ర కోసం పూర్తిస్థాయిలో సిద్ధమయ్యే నాని డెడికేషన్ గురించి ఇండస్ట్రీలో ప్రత్యేకంగా మాట్లాడుకుంటుంటారు. ఇప్పుడు ఆయన నటిస్తున్న అవైటెడ్ మూవీ ప్యారడైజ్ కోసం నాని పడుతున్న కష్టం గురించి ఆయన జిమ్ ట్రైనర్ విశ్వ భరత్ వెల్లడించిన విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న విశ్వ భరత్.. నానితో తన ప్రయాణం ఎలా మొదలైందో చెప్పుకొచ్చాడు. హిట్ 2 సమయంలో నానితో పని చేయడం ప్రారంభించానని, అప్పటి నుంచి ఆయన డెడికేషన్‌ను దగ్గరగా చూస్తున్నానని వెల్లడించాడు. "నాని అన్న పని విషయంలో నిజంగానే రాక్షసుడు. సోషల్ మీడియాలో కొంతమంది ఆయనపై నెగెటివ్ కామెంట్లు చేస్తుంటే నాకు కోపం వస్తుంది. ఎందుకంటే ఆయన ఎంత కష్టపడతారో నేను దగ్గరగా చూస్తున్నాను" అని విశ్వ పేర్కొన్నాడు. ప్రస్తుతం 'ప్యారడైజ్' షూటింగ్ ఫుల్ స్వింగ్‌లో సాగుతోందని, ఆ సినిమా కోసం నాని తన శరీరాన్ని పూర్తిగా మార్చుకుంటు న్నారని తెలిపాడు. "ఉదయం 5 గంటలకు లేచి, 6 గంటలకే సెట్స్‌లో ఉంటారు. సాయంత్రం 7 గంటల వరకు యాక్షన్ సీన్లు చేస్తూనే ఉంటారు. రోప్స్ కట్టుకుని చేసే యాక్షన్ సీక్వెన్స్‌ల వల్ల బాగా అలసిపోతారు. అయినా అక్కడితో ఆగరు" అని విశ్వ చెప్పాడు. షూటింగ్ ముగిసిన తర్వాత కూడా నాని విశ్రాంతి తీసుకోకుండా వర్కౌట్ కొనసాగిస్తారని వెల్లడించాడు. సాయంత్రం ఆయన అసిస్టెంట్ నుంచి నాకు కాల్ వస్తుంది. నాని అన్న 40 నిమిషాలు ఇంట్లో ఉంటారు.. వర్కౌట్ చేస్తారు అని చెప్తారు. అప్పటికే ఉదయం నుంచి షూటింగ్‌లో అలసిపోయి ఉన్నా, మరో 45 నిమిషాలు కచ్చితంగా జిమ్ చేస్తారు. ఇవాళ వదిలేద్దాం అని ఎప్పుడూ అనరు అంటూ నాని క్రమశిక్షణను ప్రశంసించాడు. నాని తన పాత్రల కోసం ఎంతగా కష్టపడతారో చెప్పేందుకు విశ్వ మరో ఉదాహరణ కూడా ఇచ్చాడు. జెర్సీ సినిమా కోసం నాని ప్రత్యేకంగా క్రికెట్ శిక్షణ తీసుకున్నారని గుర్తుచేశాడు. "ఆ సినిమాలో అర్జున్ పాత్ర కోసం ఆయన పూర్తిగా క్రికెటర్‌లా మారిపోయారు. ఆయన ఆట చూసి మాజీ భారత క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ కూడా మెచ్చుకున్నారు. 'నువ్వు నిజంగానే ప్రొఫెషనల్ క్రికెటర్‌లా ఆడావు' అని చెప్పారట" అని విశ్వ వెల్లడించాడు. ఇప్పుడు 'ప్యారడైజ్'లో జడల్ పాత్ర కోసం కూడా అదే స్థాయిలో కష్టపడుతున్నారని చెప్పాడు. విశ్వ చేసిన ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నాని అభిమానులు "ఇంత డెడికేషన్ ఉన్న హీరోకే విజయాలు వస్తాయి , నేచురల్ స్టార్ అంటే ఇదే" అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

# వెంకీని 'రా ఏజెంట్'గా చూపిస్తున్న త్రివిక్రమ్..

## 'ఏకే 47' ఫ్లాష్‌బ్యాక్‌లో భారీ ట్విస్ట్!

విక్టరీ వెంకటేష్ హీరోగా మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'ఆదర్శకుటుంబం-హౌస్ నెం. 47'పై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం 'ఏకే 47' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా గురించి రోజుకో ఆసక్తికర వార్త బయటకు వస్తోంది. తాజాగా ఈ చిత్ర ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌కు సంబంధించిన ఓ క్రేజీ అప్డేట్ సినీ వర్గాల్లో వైరల్ అవుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో వెంకటేశ్ పాత్ర చాలా ప్రత్యేకంగా ఉండబోతోందట. ముఖ్యంగా ఫ్లాష్‌బ్యాక్‌లో వెంకీ 'రా ఏజెంట్' పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. అయితే సాధారణ స్పై థ్రిల్లర్‌లా కాకుండా, ఈ పాత్రకు ఓ ప్రత్యేకమైన లోపాన్ని జోడించి దర్శకుడు త్రివిక్రమ్ కథను డిజైన్ చేశాడట. వెంకటేశ్ పాత్రకు దృష్టి లోపం ఉంటుందని, అలాంటి పరిస్థితిలో కూడా ఒక రా ఏజెంట్‌గా ఆయన ఎలా మిషన్లు పూర్తి చేశాడు? ఎలాంటి ఛేజ్‌లు చేశాడు? అనే అంశాలను పూర్తి ఎంటర్ టైనింగ్, థ్రిల్లింగ్ శైలిలో చూపించనున్నారని సమాచారం. ఈ కాన్సెప్ట్ ఇప్పుడు ప్రేక్షకుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. త్రివిక్రమ్ సినిమాల్లో ఎమోషన్‌తో పాటు వినోదం, స్టైలిష్ ట్రీట్‌మెంట్ ఎలా ఉంటాయో తెలిసిందే. ఇప్పుడు అదే శైలిలో యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్, స్పై డ్రామా మేళవింపుతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని టాక్ వినిపిస్తోంది. ఇక ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ కీలక పాత్రలో కనిపించనున్నాడు. 'మీర్జాపూర్' వెబ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న దివ్యేందు శర్మ ఈ సినిమాలో తీవ్రవాదిగా నటించబోతు న్నట్లు సమాచారం. ఆయన పాత్ర కథలో కీలక మలుపులకు కారణమవుతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అలాగే హీరోయిన్‌గా శ్రీనిధి శెట్టి నటిస్తోంది. భారీ స్థాయిలో తెరకె క్కుతున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ హారికా అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తోంది. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొంది స్తున్నట్లు తెలుస్తోంది. ఇక వెంకటేశ్-త్రివిక్రమ్ కాంబినేషన్ అంటే ప్రేక్షకులకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. గతంలో త్రివిక్రమ్ రచయి తగా పనిచేసిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీ శ్వరి' చిత్రాలు వెంకీ కెరీర్‌లో క్లాసిక్ హిట్లుగా నిలిచాయి. ముఖ్యంగా ఆ సినిమాల్లో కనిపిం చిన కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్ ఇప్పటికీ ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నాయి. ఇప్పుడు ఎన్నో ఏళ్ల తర్వాత వీరిద్దరూ కలిసి పనిచేస్తుం డటంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ హైప్ ఏర్పడింది. ప్రస్తుతం షూటింగ్ శరవేగం గా సాగుతుండగా, ఈ చిత్రాన్ని దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావా లని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో పాటు యాక్షన్ థ్రిల్లర్ అంశాలు కూడా ఉండటంతో 'ఏకే 47' వెంకటేశ్ కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.



# వీరభద్రుడి దుష్టశిక్షణ



సూర్య కథానాయకుడిగా నటిస్తున్న తమిళ చిత్రం 'కరుప్పు'.. 'వీరభద్రుడు' పేరుతో తెలుగులో అనువాదమవుతున్నది. ఆర్జే బాలాజీ దర్శకుడు. ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురాను ంది. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నది. ఈ చిత్రంలో సామాన్యుల తరపున పోరాటం చేసే న్యాయవాది పాత్రలో సూర్య కనిపించను న్నారు. సామాజిక అంశాలతో పాటు డివోషనల్ టచ్‌తో కూడుకున్న ఈ కాన్సెప్ట్‌లో థ్రిల్లింగ్ అంశాలుంటాయని మేకర్స్ చెబుతున్నారు. వీరభద్రుడిగా సూర్య నట విశ్వరూపం ప్రదర్శించాడని, దుష్ట శిక్షణ కోసం ఆయన ఎలాంటి మార్గాన్ని అనుసరించాడన్నది ఆసక్తికరంగా ఉంటుందని, యాక్షన్ సీక్వెన్సెస్ ప్రధానాకర్షణగా నిలుస్తాయని చెబుతున్నారు. త్రిష, ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ, మాయ రవి, సుప్రీత్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సాయి అభ్యంకర్, నిర్మాతలు: ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు, రచన-దర్శకత్వం: ఆర్జే బాలాజీ.

# బ్యాంకాక్‌కు షిఫ్ట్ అయిన అవికా గోర్..



## గ్లోబల్ కెరీర్‌పై ఫోకస్ పెట్టిన చిన్నారి పెళ్లికూతురు

తెలుగు ప్రేక్షకులకు 'చిన్నారి పెళ్లికూతురు'గా ఎంతో దగ్గరైన అవికా గోర్ ఇప్పుడు తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. టెలివిజన్ సీరియల్స్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న అవికా.. తరువాత తెలుగు సినిమాల్లో హీరోయిన్‌గా కూడా మంచి అవకాశాలు అందుకుంది. అయితే గత కొంతకాలంగా ఆమె సినీ కెరీర్ ఊహించిన స్థాయిలో ముందుకు సాగలేదు. ఇటీవల నటించిన కొన్ని సినిమాలు కూడా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయాయి. ఇలాంటి సమయంలో అవికా గోర్ తీసుకున్న తాజా నిర్ణయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆమె తన నివాసాన్ని భారతదేశం నుంచి థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌కు మార్చేసినట్లు తెలుస్తోంది. పర్సనల్‌గా ఎదగడంతో పాటు అంతర్జాతీయ అవకాశాలను అందిపుచ్చుకోవాలనే ఆలోచనతోనే ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు అవికా వెల్లడించింది. బ్యాంకాక్ నగరం తనకు ఎంతో ఇష్టమని, అక్కడి జీవనశైలి తనను బాగా ఆకట్టుకుందని ఆమె తెలిపింది. ప్రశాంతమైన వాతావరణం, కొత్త సంస్కృతి, స్వేచ్ఛాయుత జీవనం తనలోని సృజనాత్మకతను మరింత పెంచుతాయని అవికా భావిస్తోంది. అయితే తాను భారతీయ చిత్ర పరిశ్రమకు దూరం కావడం లేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం తన చేతిలో కొన్ని బాలీవుడ్ ప్రాజెక్టులు ఉన్నాయని, షూటింగ్స్ ఉన్నప్పుడు ఇండియాకు వచ్చి పని పూర్తి చేసుకుని తిరిగి బ్యాంకాక్ వెళ్తానని తెలిపింది. నేటి డిజిటల్ యుగంలో భౌగోళిక దూరాలు పెద్ద సమస్య కాదని, ఎక్కడి నుంచైనా కథా చర్చల్లో పాల్గొనవచ్చని ఆమె అభిప్రాయపడింది. నటిగానే కాకుండా నిర్మాతగా కూడా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని అవికా ప్లాన్ చేస్తోంది. థాయ్‌లాండ్‌లో నివసించడం వల్ల అక్కడి చిత్ర పరిశ్రమతో పాటు అంతర్జాతీయ నిర్మాణ సంస్థలతో పరిచయాలు పెంచుకోవడం సులభమవుతుందని ఆమె భావిస్తోంది. భవిష్యత్తులో భారతీయ, థాయ్ చిత్ర పరిశ్రమల మధ్య కొత్త తరహా భాగస్వామ్యాలు తీసుకురావాలనే ఆలోచన కూడా ఆమెకు ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే థాయ్ భాషా సినిమాల్లో నటించే అవకాశాలను కూడా అవికా పరిశీలిస్తోంది. భారతీయ సినిమాల్లో నటిస్తూనే ఆసియా మార్కెట్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించాలని ఆమె లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా అవికా తీసుకున్న ఈ నిర్ణయం నేటి తరం నటీనటుల గ్లోబల్ ఆలోచనా విధానానికి నిదర్శనంగా మారింది.

# ఆసక్తికరంగా 'దృశ్యం 3' ట్రైలర్ ..

ఈసారి పోలీసులే కాదు, మీడియా కూడా జార్జ్ కుట్టి వెంట!

భారతీయ సినీ పరిశ్రమలో సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలకు ప్రత్యేకమైన గుర్తింపు తీసుకొచ్చిన 'దృశ్యం' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న మూడో భాగం 'దృశ్యం 3'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన రెండు భాగాలు అద్భుతమైన కథనం, ఉత్కంఠభరిత ట్విస్టులతో ప్రేక్షకులను కట్టిపడేశాయి. ఇప్పుడు అదే మ్యాజిక్‌ను మరింత పెద్ద స్థాయిలో చూపించేందుకు దర్శకుడు జీతూ జోసెఫ్ సిద్ధమయ్యారు. శనివారం విడుదలైన 'దృశ్యం 3' ట్రైలర్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ట్రైలర్‌ను బట్టి చూస్తే ఈసారి కథ మరింత డార్క్, ఇంటెన్స్‌గా ఉండబోతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. "గతం ఎప్పటికీ నిశ్శబ్దంగా ఉండదు.. అది సరైన సమయం కోసం ఎదురుచూస్తుంది" అనే డైలాగ్‌తో ట్రైలర్ ప్రారంభమవుతుండగా, జార్జ్ కుట్టి పాత్రలో మోహన్ లాల్ మరోసారి తన నటనతో ఆకట్టుకున్నారు. గత రెండు భాగాల్లో పోలీసుల దర్యాప్తు ప్రధానంగా సాగిన కథ.. ఈసారి కొత్త మలుపు తిరిగింది. దర్శకుడు జీతూ జోసెఫ్ ఈసారి మీడియా ఇన్వెస్టిగేషన్‌ను కథలో కీలక అంశంగా చూపించారు. వరుణ్ ప్రభాకర్ కేసు వెనుక ఉన్న నిజాలను వెలికితీయడానికి ఇద్దరు యువ జర్నలిస్టులు రంగంలోకి దిగడం కథలో ఆసక్తిని మరింత పెంచుతోంది. జార్జ్ కుట్టి కుటుంబం చుట్టూ మళ్లీ అనుమానాలు ముసురుకుంటుండగా, మీడియా విచారణతో పరిస్థితులు మరింత క్లిష్టంగా మారినట్లు ట్రైలర్‌లో చూపించారు. కుటుంబాన్ని రక్షించుకోవడానికి జార్జ్ కుట్టి ఎంతటి సాహసానికైనా సిద్ధమవుతాడనే విషయం మరోసారి స్పష్టమవుతోంది. ప్రతి సీన్‌లోనూ ఉత్కంఠను పెంచేలా ట్రైలర్ కట్ చేయడం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో మీనా, ఎస్తర్ అనీల్, అన్సిబ హసన్, ఆశా శరత్, సిద్ధార్థ్ తదితరులు తమ పాత పాత్రలతో తిరిగి కనిపించనున్నారు. అలాగే వీణా నందకుమార్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. రెండో భాగంలో ఆకట్టుకున్న మురళీ గోపి, గణేష్ కుమార్, శాంతి మాయాదేవి కూడా ఈసారి కథలో భాగమయ్యారు. టెక్నికల్‌గా కూడా 'దృశ్యం 3' మరింత బలంగా కనిపిస్తోంది. సతీష్ కురుప్ సినిమాటోగ్రఫీ, వినాయక్ వి.ఎస్ ఎడిటింగ్, అనిల్ జాన్సన్ సంగీతం ట్రైలర్‌కే థ్రిల్లింగ్ ఫీల్ తీసుకొచ్చాయి. ముఖ్యంగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌ను మరో స్థాయికి తీసుకెళ్లిందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఈ సినిమాను మే 21న, మోహన్‌లాల్ పుట్టినరోజు సందర్భంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇక హిందీ ప్రేక్షకుల కోసం కూడా 'దృశ్యం 3' సిద్ధమవుతోంది. అజయ్ దేవగణ్ హీరోగా రూపొందుతున్న హిందీ వెర్షన్‌ను అక్టోబర్ 2న గాంధీ




జయంతి సందర్భంగా విడుదల చేయనున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ట్రైలర్‌కు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే 'దృశ్యం 3' మరోసారి ఇండియన్ సినీ ప్రేక్షకులను థ్రిల్ చేయడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.